మంగళవారం
01-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 129
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యా-చైనా మైత్రికి 65 ఏళ్లు

రష్యా-చైనా మైత్రికి 65 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా రెండు దేశాల అధ్యక్షులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 2లో

మీడియా హైజాక్

▸ అది కార్పొరేట్ల దుశ్చర్య ▸ ఐజేయూ ప్లీనరీలో డి.రాజా

విశాలాంధ్ర-చెన్నై: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులను, రాజ్యాంగబద్ధ సంస్థలను అణచివేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. పత్రికా రంగంలోకి కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి ప్రజల ఆలోచనలను హైజాక్ చేస్తున్నాయని అన్నారు. చెన్నైలోని డీబీఎస్ మహల్ ఆవరణలో కామ్రేడ్ సంతోశ్‌కుమార్ ప్రాంగణం కామ్రేడ్ కె.అమర్నాథ్ హాల్‌లో జరిగిన ఐజేయూ పదవ ప్లీనరీలో రాజా సోమవారం మాట్లాడారు. మోదీ హయాంలో మేధావులు, చింతనపరులకు స్వేచ్ఛగా ఆలోచించే పరిస్థితి లేదని రాజా అన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే దేశద్రోహులుగా ముద్రవేసి జైళ్లకు పంపుతున్నారన్నారు. దేశం, ప్రజల పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో జర్నలిస్టు సంఘాలు ప్రత్యేకించి ఐజేయూ భిన్నమైన పాత్ర పోషించాలని డి.రాజా ఉద్బోధించారు. పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని, అసమ్మతిని సహించే స్థితిలో ప్రభుత్వాలు లేవని మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ పరిరక్షణ కోసం పోరాటాలకు, ఐజేయూ ఉద్యమాలకు సీపీఐ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని రాజా హామీ ఇచ్చారు. మోదీ ప్రభుత్వ ఈర్ష్యా ద్వేషాలను కార్పొరేట్ మీడియా సమాజంలో వ్యాప్తి చేస్తోందని విమర్శించారు. జర్నలిస్టులకు వ్యతిరేకంగా చర్యలకు పాల్పడితే వారు సహించబోరన్న సందేశాన్ని మోదీ ప్రభుత్వానికి ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇతరులకు ఆదర్శంగా మీడియా నిలవాలని, ప్రజలు, కార్మిక, కర్షకులు, సామాన్యుల వాణిని వినిపించాలన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని రాజా అన్నారు.

టీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు
2లో

పరిహారం ఇవ్వాల్సిందే

▸ అంచనాలు తగ్గిస్తున్న అధికారులు
▸ జగన్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వం
▸ అనంత కలెక్టరేట్ వద్ద ధర్నాలో రామకృష్ణ, ప్రసాద్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: అధిక వర్షాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోతే రెవెన్యూ అధికారులు వేలల్లో చూపిస్తున్నారని, సర్వే నివేదికలు తప్పుల తడకగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఈ నెల 27 నుండి 3 రోజులపాటు సీపీఐ, రైతుసంఘం జిల్లా నాయకులు పరిశీలించిన విషయం తెలిసిందే. పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ, రైతుసంఘం నేతలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రామకృష్ణ, కేవీవీ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అకాలవర్షాలు పంటలను పూర్తిగా దెబ్బ తీశాయని, వాటితోపాటు అనేక చోట్ల ఇళ్లు కూలి పోయాయని చెప్పారు. జిల్లా ప్రజలు అతివృష్టి, అనావృష్టితో జిల్లా ప్రజలు నిత్యం నష్టపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు అధికమై పంటలు కోల్పోయి రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారని తెలిపారు. నగరంలో చాలా కాలనీలు నీట మునిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని వందల కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. అయితే కేవలం 9,800 ఎకరాల్లోనే పంటలు దెబ్బతిని రూ.16.50 కోట్ల నష్టం జరిగినట్లు రెవెన్యూశాఖ అధికారులు అంచనా నివేదికలు తయారు చేయడం విడ్డూరమని విమర్శించారు. లక్షల ఎకరాల్లో పంట నష్టపోయిన విషయాన్ని సీపీఐ శ్రేణులు బాధిత ప్రాంతాల్లో పర్యటించి బాధిత రైతుల ద్వారా పూర్తి సమాచారం సేకరించారన్నారు. వాణిజ్య పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, పండ్లతోటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో రైతులు నష్టాలు చవిచూస్తుంటే సీఎం జగన్ మాత్రం వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగిస్తూ అన్యాయం చేస్తున్నారని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. మోటార్లకు మీటర్లు బిగించడాన్ని సీపీఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. పంపు సెట్లకు మీటర్లు బిగించే ముసుగులో వందల కోట్లు నొక్కేయడానికి సీఎం జగన్ కుట్ర పన్నారన్నారు. కమీషన్ల కక్కుర్తి కోసమే జగన్ తమకు అనుకూలంగా ఉన్న కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చి రైతుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విద్యుత్ చార్జీలు చెల్లించకపోవడంతో హంద్రీనీవా పంపు మీటరుకు కరెంటు ఆపేశారని, దీనివల్ల లక్షలహెక్టార్లు నీరులేక ఎండిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో రైతులు బతకాలన్నా...అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నా పోరాటం తప్ప మరో మార్గం లేదని స్పష్టంచేశారు. నవంబర్ 3,4,5 తేదీల్లో విజయవాడలో సీపీఐ రాష్ట్రసమితి సమావేశాలు జరుగుతున్నాయని, అందులో ప్రజా సమస్యలను చర్చించి వైసీపీ ప్రభుత్వం మెడలువంచే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేంతవరకు పోరాటం ఆగదన్నారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా అధిక వర్షాలు పంటలను

- మిగతా 2 లో

నారాయణ
బెయిల్ రద్దు

విశాలాంధ్ర - చిత్తూరు: పదోతరగతి పబ్లిక్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో మాజీ మంత్రి, నారాయణ విద్యా సంస్థల మాజీ అధినేత పీ నారాయణ బెయిల్ రద్దు చేస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని ఎస్పీ రిషాంత్ రెడ్డి సోమవారం విలేకరులకు వివరించారు. 2022లో నిర్వహించిన పబ్లిక్ పరీక్షల సమయంలో నెల్లేపల్లి హైస్కూల్‌లో తెలుగు ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై చిత్తూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను, నారాయణ విద్యాసంస్థలకు చెందిన తొమ్మిది మంది సిబ్బంది అరెస్టు చేసినట్టు తెలిపారు. మే 10న నారాయణను అరెస్టు చేసి, చిత్తూరు ఒకటో పట్టణ పోలీస్‌లు జడ్జి ఎదుట హాజరు పరిచారనీ, కేసు దర్యాప్తును పరిశీలించిన జడ్జి అర్ధరాత్రి నారాయణకు బెయిల్ మంజూరు చేసి విడుదల చేశారన్నారు. ఈకేసులో మిగిలిన ఎనిమిదిమందిని రిమాండ్

- మిగతా 2 లో

అంతులేని విషాదం

141కు పెరిగిన మృతులు

▸ దర్యాప్తునకు కమిటీ: ప్రభుత్వం
▸ నిర్వహణ సంస్థలపై ఎఫ్ఐఆర్ నమోదు
▸ న్యాయ విచారణకు కాంగ్రెస్ డిమాండ్
▸ పరిహారం పెంచాలి: వామపక్షాలు
▸ నేడు మోర్బికి ప్రధాని

మోర్బి: గుజరాత్‌లోని మోర్బిలో తీగల వంతెన కూలిన ఘటన అంతులేని విషాదాన్ని మిగిల్చింది. మృతుల సంఖ్య 141కు పెరిగింది. దాదాపు వంద మంది ఆచూకీ లేనట్లు తెలుస్తోంది. మృతుల్లో 47 మంది చిన్నారులున్నారు. మృతుల కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. సోమవారం సాయంత్రం వరకు సహాయక చర్యలు కొన సాగాయి. దాదాపు వందేళ్ల నాటి ఈ వంతెనకు ఆరు నెలల పాటు తీవ్రస్థాయిలో మరమ్మతులు జరిపి గుజరాతీ నూతన సంవత్సరాన్ని పురస్కరించు కొని 26వ తేదీన అందుబాటులోకి తెచ్చారు. 150-200 మందిని మోయగల ఈ వంతెనపైకి 650 మందికి అనుమతి వ్వడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం 6.30గంటలకు ప్రమాదం జరిగిందని, మృతుల సంఖ్య 141కు చేరిందని రాజ్‌కోట్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు. ఐదు ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఆరు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఆర్మీ, నేవీ, వైమానిక దళ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సింఘ్వీ మోర్బిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సంఘ్వీ తెలిపారు. వంతెన నిర్వహణ సంస్థలపై ఐపీసీలోని 304, 308, 114 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదైనట్లు

- మిగతా 2 లో

బ్రెజిల్ అధ్యక్షుడిగా లులా

51శాతం ఓట్లతో విజయం

▸ 2023లో పదవీ బాధ్యతల స్వీకరణ
▸ ఇది ప్రజాస్వామిక ఉద్యమం గెలుపు: లులా
▸ క్లిష్టపరిస్థితుల్లో సమర్థపాలన అందిస్తానని హామీ

సావో పాలో: బ్రెజిల్ అధ్యక్షుడిగా లులా డా సిల్వా (77) ఎన్నికై సంచలనం సృష్టించారు. దాదాపు 20ఏళ్ల తర్వాత తిరిగి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించనున్నారు. తన ప్రత్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జైర్ బోల్సనారోతో హోరాహోరీగా సాగిన పోరులో విజేతగా లెఫ్టిస్ట్ వర్కర్స్ పార్టీ సీనియర్ నేత, దేశ మాజీ అధ్యక్షుడు లూయిజ్ ఇన్‌సియో లులా డా సిల్వా నిలిచారు. ఆయన 51శాతం ఓట్లు సాధించగా బోల్సనారోకు 49.1శాతం ఓట్లు వచ్చాయి. ఆయన 2023లో పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. తన గెలుపుపై లులా స్పందిస్తూ ఇది ప్రజాస్వామిక ఉద్యమ విజయమని నొక్కిచెప్పారు. 'బ్రెజిల్ ప్రజలే నిజమైన విజేతలు. ఇది నా విజయమో లేక వర్కర్స్ పార్టీదో...ప్రచారంలో నాకు మద్దతిచ్చిన పార్టీలదో కాదు. రాజకీయ పార్టీలకు, వ్యక్తిగత ప్రయోజనాలు-సిద్ధాంతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విజయానికి సాగిన ఉద్యమం విజయవంతమైంది' అని సావోపాలోలోని హోటల్‌లో ప్రసంగించిన లులా అన్నారు. దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ సమర్థ పరిపాలనను అందిస్తానని హామీనిచ్చారు. దేశానికి పూర్వవైభవాన్ని తెస్తానన్నారు. మరలా సుసంపన్న బ్రెజిల్‌ని మనం చూస్తామంటూ ఉద్ఘాటించారు. 'నన్ను సజీవ సమాధి చేయాలని వారు యత్నించారుగానీ నేను ఇక్కడ నిలిచాను' అని అన్నారు. అమెజాన్ అడవి నరికివేతకు ముగింపు పలుకుతానని, దేశంలో ఆకలిని నిర్మూలించడమే తన తక్షణ కర్తవ్యమని లులా తెలిపారు. దేశానికి శాంతి-ఐక్యత అవశ్యమని అన్నారు. ఆకలి సంక్షోభం; ఆర్థిక సంక్షోభం, అమెజాన్ అడవి నరికివేత, రాజకీయ

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఏం.. అంత పకడ్బందీగా దొరక్కుండా చేసాడంటావా? మనోడు!

వాస్తవ ప్రగతి చూపండి

▸ యూనిట్‌గా గ్రామ, వార్డు సచివాలయాలు
▸ నెల రోజులకోసారి వివరాల నమోదు
▸ విద్యారంగ సంస్కరణలో మంచి ఫలితాలు
▸ అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం
▸ సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రగతి అనేది కేవలం అందమైన అంకెల రూపంలో చూపడం కాదనీ, వాస్తవ రూపంలో ఉండాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. ప్రతి అంశంలో సాధించాల్సిన ప్రగతిపై క్షేత్ర స్థాయిలో నిశిత పరిశీలన, పర్యవేక్షణ ఉండాలన్నారు. సుస్థిర లక్ష్యాల సాధనలో గ్రామ, వార్డు సచివాలయాలు యూనిట్‌గా

- మిగతా 2 లో

జర్నలిజం పరిరక్షణకు ప్రచారాందోళన

▸ జనవరిలో దేశవ్యాప్తంగా నిర్వహణకు ఐజేయూ ప్లీనరీ పిలుపు
▸ వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం పునరుద్ధరణ
▸ వేజ్ బోర్డుల నియామకానికి డిమాండు

విశాలాంధ్ర-చెన్నై: మీడియారంగం- పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి జనవరిలో దేశవ్యాప్తంగా ప్రచారాందోళన చేపట్టాలని ఐజేయూ పదవ ప్లీనరీ పిలుపునిచ్చింది. అక్టోబరు 29,30,31 తేదీల్లో చెన్నైలోని డీబీఎస్ మహల్ ఆవరణలో కామ్రేడ్ సంతోశ్ కుమార్ ప్రాంగణంలో, కామ్రేడ్ కె.అమర్నాథ్ హాల్‌లో ఐజేయూ జాతీయ ప్లీనరీ జరిగింది. సోమవారం ముగింపు సమావేశంలో అనేక తీర్మానాలను ప్లీనరీ ఆమోదించింది. ఇటీవల రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని, జర్నలిస్టుల భద్రత కోసం జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టాన్ని తేవాలని, వర్కింగ్ జర్నలిస్టులు - నాన్ జర్నలిస్టుల వేతనాల సవరణ కోసం కొత్త వేజ్ బోర్డు నియమించాలని, జీఆర్ మజీతియా వేజ్‌బోర్డు సిఫార్సులు అమలు చేయాలని, కరోనాతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండు చేసింది. జర్నలిజంలో నైతిక విలువలను, వృత్తి ప్రమాణాలను పరిరక్షించేందుకు కృషిచేసేలా ప్రజల్ని చైతన్యపర్చేందుకు దేశవ్యాప్తంగా ప్రచారందోళన చేపట్టాలని ఐజేయూ ప్లీనరీ తీర్మానించింది. జనవరిలో చేపట్టే ప్రచారాందోళనలో పౌరసమాజ ప్రముఖులను

- మిగతా 2 లో

అత్యంత ప్రజాదరణ గల నేత లులా

సావోపాలో: దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన అధ్యక్షుడిగా లులా డా సిల్వా పేరుగాంచారు. పేదల్లో మంచి గుర్తింపు పొందారు. ప్రజల నాయకుడిగా ఎదిగారు. లులా డ సిల్వా 1945లో ఈశాన్య బ్రెజిల్‌లో ఓ పేద కుటుంబంలో పుట్టారు. ఏడేళ్లప్పుడు ఈయన కుటుంబం పని కోసం సావో పాలోకు వలస వచ్చింది. పదేళ్లు వచ్చే వరకు లులా చదువుకోలేదు. 14వ ఏట సావో పాలో శివార్లలో ఓ కార్ల ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరారు. 1960లో ఫ్యాక్టరీలో ప్రమాదం జరగడంతో తన చేతి చిటికెన వేలు పోగొట్టుకున్నారు. లులా మొదటి భార్య 1969లో హెపటైటిస్‌తో చనిపోయారు. అప్పటివరకూ రాజకీయాలపై ఆసక్తి చూపని లులా తన భార్య చనిపోయిన మరుసటి ఏడాది కార్మిక రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1975లో లక్ష మంది సభ్యులు ఉన్న మెటల్‌వర్కర్స్ యూనియన్ నేతగా ఎన్నికయ్యారు. ప్రభుత్వానికి సానుకూలంగా ఉన్న కార్మిక సంఘాలను బలమైన స్వతంత్ర్య ఉద్యమంగా మలిచారు. 1970లో బ్రెజిల్ సైనిక పాలకులను ధిక్కరిస్తూ వేతనాల పెంపు కోసం కార్మికుల సమ్మెల్లో ప్రముఖ పాత్ర పోషించారు. ఇదే క్రమంలో 1980 ఏప్రిల్‌లో అరెస్టు అయి నెల రోజులు జైలులో ఉన్నారు. విడుదలైన తర్వాత బ్రెజిల్ చరిత్రలో మొట్టమొదటి ప్రధాన సోషలిస్ట్ పార్టీ అయిన వర్కర్స్ పార్టీ వ్యవస్థాపనలో కీలకంగా వ్యవహరించారు. అధికార వ్యవస్థను మార్చటానికి పనిచేస్తున్న కార్మిక నేతలు, మేధావులు, కార్యకర్తలను ఈ పార్టీ ద్వారా ఏకం చేశారు. వర్కర్స్ పార్టీ తరపు అధ్యక్ష పదవికి పోటీ చేసి మూడుసార్లు విఫలమయ్యారు. 2002లో నాల్గో ప్రయత్నం ఫలించడంతో బ్రెజిల్ అధ్యక్షుడిగా లులా ఎన్నికయ్యారు. తొలి కార్మికవర్గ అధ్యక్షుడిగా చరిత్ర సృష్టించారు. 2003 జనవరి నుంచి 2010 డిసెంబరు వరకు అంటే ఎనిమిదేళ్లు వరుసగా రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సామాజిక అసమానతలను తగ్గించటానికి కృషి చేశారు. ఎగుమతుల ద్వారా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉన్నత విద్య, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేశారు. కనీస వేతనాన్ని ద్రవ్యోల్బణం రేటు కన్నా ఎక్కువకు పెంచారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సాయాన్ని విస్తరించారు. దేశంలో 4.4 కోట్ల మందిని పేదరికం నుంచి గట్టెక్కించారు. 1970లో బ్రెజిల్‌లోని సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. 2003–10లో బ్రెజిల్ 35వ అధ్యక్షుడిగా ఉన్నారు. అవినీతి ఆరోపణల రావడంతో రాజీనామా చేశారు. 2018లో జైలు పాలయ్యారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అప్పట్లో నిషేధం విధించారు. ఆ సంవత్సరం బోల్సోనారో అధ్యక్షుడిగా గెలిచారు. లులా జైలు నుంచి వచ్చాక రాజకీయ పోరాటంలో పాల్గొన్నారు. తాజా ఎన్నికల్లో లేబర్ పార్టీ నేత జైర్ బొల్సొనారోను ఓడించారు. లులాను భూమి మీద అత్యంత ప్రజాదరణ ఉన్న రాజకీయ నాయకుడిగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కొనియాడారు. కాగా, లులా తన పదవి నుంచి దిగినప్పుడు ఆయనకు 80శాతానికిపైగా ప్రజా మద్దతు ఉంది.

విశాలాంధ్ర ప్రపంచం

రష్యా–చైనా మైత్రికి 65 ఏళ్లు

- పుతిన్‌కు జిన్‌పింగ్ లేఖ
- శుభాకాంక్షలు తెలుపుకున్న ఇద్దరు అధ్యక్షులు

బీజింగ్: రష్యా–చైనా మైత్రికి 65 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా రెండు దేశాల అధ్యక్షులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఒక లేఖను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పంపారు. 'ఫ్రెండ్‌షిప్ అసిసోయేషన్' 65వ వ్యవస్థాపక వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తమ మధ్య స్నేహ బంధం సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగిందని, రెండు దేశాల ప్రజల మధ్య పరస్పరం అవగాహన, సయోధ్య, నమ్మకం, మైత్రిని పెంపొందించేందుకు తోడ్పడిందని, ద్వైపాక్షిక స్నేహ సంబంధాలకు మద్దతు సమీకరించగలిగిందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. నవశకం కోసం పరస్పరం సహకరించుకుంటూ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అత్యున్నస్థాయి అభివృద్ధికి, అనేక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు చైనా–రష్యా కట్టుబడి ఉన్నాయన్నారు. రెండు దేశాల మధ్య పటిష్ట స్నేహ బంధంతో భవిష్యత్తులో అభివృద్ధి గొప్ప అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని జిన్‌పింగ్ ఆకాంక్షించారు.

చైనాలో మహిళల సంరక్షణకు కొత్త చట్టం

హాంగ్‌కాంగ్: లైంగిక వేధింపులు, వివక్ష నుంచి మహిళలకు రక్షణ కల్పించే విధంగా కొత్త చట్టాన్ని చైనా తెచ్చింది. ప్రజాభిప్రాయ సేకరణ - మూడవ సమీక్ష తర్వాత ఈ బిల్లును దేశంలోని అత్యున్నత చట్టసభ ముందర ఉంచగా ఆదివారం ఆమోదం లభించడంతో అది చట్టరూపం దాల్చింది. అయితే దాదాపు 30 ఏళ్ల తర్వాత మహిళల సంరక్షణ కోసం చట్టాన్ని చైనా ప్రభుత్వం సవరించింది. అబార్షన్ (గర్భవిచ్ఛిత్తి)పై ఆంక్షలు, హక్కుల నిరాకరణ/అణచివేత, తగ్గిపోతున్న మహిళల పాత్రపై కార్యకర్తలు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ కొత్త చట్టాన్ని చైనా తీసుకువచ్చింది.

నా మనసు మోర్బీ బాధితులతో ఉంది: మోదీ

నర్మద(గుజరాత్): గుజరాత్‌లోని మోర్బీ నగరంలో తీగల వంతెన కూలిన ఘటనలో మృతులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం నివాళులర్పించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఎటువంటి అలసత్వం ఉండదని పేర్కొన్నారు. భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతి సందర్భంగా కేవడియాలోని ఏక్తానగర్‌లో ఐక్యతా విగ్రహాన్ని సందర్శించారు. వల్లభాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. అయితే అక్కడ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా మోర్బీ ఘటన కారణంగా వాటిని రద్దు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా మృతుల కుటుంబాలకు అండగా ఉంది. గుజరాత్ ప్రభుత్వం నిన్నటి నుంచి సహాయ, సహాయక చర్యలు చేపడుతోంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అన్ని విధాలా సహాయాన్ని అందజేస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. 'నేను ఏక్తా నగర్‌లో ఉన్నాను కానీ నా మనస్సు మోర్బీ బాధితులతో ఉంది. నా జీవితంలో చాలా అరుదుగా ఇలాంటి బాధను అనుభవించాను. ఒక వైపు, నొప్పితో నిండిన హృదయం ఉంది... మరోవైపు, కర్తవ్య మార్గం ఉంది' అని ప్రధాని అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ గత రాత్రి మోర్బీకి చేరుకున్నారని, గాలింపు, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని ప్రధాని చెప్పారు. 'ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు.

పదివేల ఎన్నికల బాండ్లు ముద్రించాం: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ఆగస్ట్ 1 నుండి అక్టోబర్ 29 వరకు ఒక్కోటి కోటి రూపాయిల విలువ కలిగిన పదివేల ఎలక్టోరల్ బాండ్లను ముద్రించినట్లు ఎస్‌బిఐ పేర్కొంది. 2022 క్యాలెండర్ ఇయర్‌లో రూ.కోటి విలువైన పదివేల ఎలక్టోరల్ బాండ్లను ముద్రించినట్లు కన్హయ్య కుమార్ అడిగిన మరో ప్రశ్నకు ఇదే సమాధానమిచ్చింది. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఓ కార్యకర్త అడిగిన వేర్వేరు ప్రశ్నలకు వేర్వేరు తేదీల్లో ఎస్‌బీఐ ఒకే సమాధానమివ్వడం గమనార్హం. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికలకు ముందు అక్టోబర్ 1 నుంచి 10 తేదీల మధ్య ఇటీవలి విడత ఎలక్టోరల్ బాండ్లు విక్రయించినట్లు తెలిపింది. చివరి సారిగా ప్రభుత్వం 2019లో బాండ్లను ముద్రించిందని, నాసిక్‌లోని ఇండియా సెక్యూరిటీ ప్రెస్‌లో రూ. 11,400 కోట్ల విలువైన బాండ్లను ముద్రించినట్లు ఎస్‌బిఐ సమాధానమిచ్చింది. 2018, 2019 మధ్య ముద్రించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆగస్ట్ 1న ఒకే ఉదాహరణతో ఎస్‌బీఐ అందించింది. ఎస్‌బీఐ ఆగస్ట్ 1, 2018, 2019లో ముద్రణ వివరాలను అందించింది. ఎలక్టోరల్ బాండ్ల ముద్రణకు అయ్యే ఖర్చును ప్రభుత్వ ఖజానా భరిస్తుందా లేదా కొనుగోలు దారుడు భరిస్తారా అన్న ప్రశ్నకు ఎస్‌బీఐ అక్టోబర్ 29న ఈ విధంగా సమాధానమిచ్చింది. బాండ్ల ముద్రణకు అవసరమైన స్టేషనరీని ప్రభుత్వం నుండి పొందుతామని, వాటిని ఎస్‌బీఐ అనుబంధ బ్రాంచ్‌లలో విక్రయిస్తుందని పేర్కొంది. ఎస్‌బీఐ ఇటీవలి తన ప్రత్యుత్తరంలో అందించిన సమాచారాన్ని ఉటంకిస్తూ.. జులైలో ఒక విడత బాండ్లను విక్రయించిన తర్వాత అదే విలువ కలిగిన 5,068 బాండ్లు అమ్ముడు పోకుండా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం మరో కోటి రూపాయిల విలువ కలిగిన 10వేల ఎలక్టోరల్ బాండ్లను ముద్రించిందని కన్హయ్య కుమార్ పేర్కొన్నారు. 2018లో ఈ పథకం ప్రారంభమైప్పటి నుంచి ప్రభుత్వం కోటి రూపాయిల విలువ కలిగిన 24,650 బాండ్లను ముద్రించినప్పటికి.. 10,108 మాత్రమే విక్రయించినట్లు తెలిపారు.

బ్రెజిల్ అధ్యక్షుడిగా లులా

(మొదటిపేజీ తరువాయి)

విభజన వంటి అనేక సవాళ్లు తన ముందుర ఉన్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాం అంటూ నినదించారు. వర్కర్స్ పార్టీకి చెందిన వేలాది మంది అరుణ పతాకాలను ఊపుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేయగా లులా సభ ప్రాంగణం మద్దతుదారులతో కిక్కిరిసింది. ఆయన 2023, జనవరి 1న అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. కాగా, లులాకు బోత్సనారోకు మధ్య 21 లక్షల పైచిలుకు ఓట్ల తేడా మాత్రమే ఉండగా బోల్సనారో తన ఓటమిని ఇప్పటివరకు అంగీకరించలేదు.

లులాకు ప్రపంచ దేశాధినేతల శుభాకాంక్షలు

బ్రెజిల్ అధ్యక్షుడిగా గెలిచినందుకు లులాకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అమెరికా, ఫ్రాన్స్, అర్జెంటైనా, భారత్, కొలంబియా, మెక్సికో, వెనిజులా, కెనడా తదితర దేశాల అధినేతలు అభినందనలు తెలిపారు. బ్రెజిల్‌తో సహకార–స్నేహ బంధాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. 'లాంగ్ లివ్ లులా' అంటూ కొలంబియాకు తొలి వామపక్ష అధ్యక్షుడు గుస్టావో పెట్రో ట్వీట్ చేశారు. 'లులా గెలుపు బ్రెజిల్ ప్రజలకు వరం.. ఇక సమానత్వం- మానవత్వం దేశంలో ఉంటాయి' అని మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెజ్ మాన్యుల్ లోపెస్ ఓబ్రెడార్ ట్విట్టర్‌లో వెల్లడించారు. 'బిగ్ హగ్ టు లులా' అని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తన ఆనందాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. 'ప్రజలు స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, స్వేచ్ఛను కోరుకున్నారు. బ్రెజిల్ ప్రజాస్వామ్యం విజయం సాధించింది' అని మదురో పేర్కొన్నారు.

పరిహారం ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

అతలాకుతలం చేశాయని, దీనివల్ల నష్టపోయిన రైతులను మాత్రం ప్రభుత్వం ఆదుకోలేదని విమర్శించారు. గిట్టుబాటుధర లేక అరటి, ఉల్లి, టమోటాతో పాటు ఇతర పంటలు వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో ఇతర రైతుసంఘాలతో కలిసి బుద్ధిచెబుతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, జిల్లా కార్యవర్గసభ్యులు, నియోజకవర్గాల కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నారాయణ బెయిల్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేశామని, బెయిల్‌పై చిత్తూర్ ఒకటో పట్టణ పోలీసులు 9వ ఏడీజే కోర్టు, చిత్తూరులో బెయిల్ రద్దుపై పిటిషన్ ఫైల్ చేసి వాదనలు వినిపించారనీ, వాదనలపై విచారణ జరిపిన కోర్టు నారాయణకు సోమవారం బెయిల్ రద్దు చేసి, 4వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, చిత్తూరు ఎదుట హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

టీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు

- బీజేపీ విభజన రాజకీయాలు
- దేశ ఐక్యత కోసమే జోడో యాత్ర
- గుజరాత్, హిమాచల్‌లో గెలుస్తాం: రాహుల్

విశాలాంధ్ర–హైదరాబాద్: టీఆర్‌ఎస్‌తో ఎలాంటి అవగాహన లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని.. ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. 'భారత్ జోడో యాత్ర'లో భాగంగా రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. టీఆర్‌ఎస్‌తో పొత్తు వద్దన్నది తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయమని.. దాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 'వచ్చే పార్లమెంట్ ఎన్నికలు విభజన శక్తులు, సంఘటిత శక్తులకు మధ్య జరిగే పోరాటంగా ఉండబోతున్నాయి. బీజేపీ, టీఆర్ఎస్ ప్రజాధనాన్ని దోచుకుంటున్నాయి. ఉపఎన్నికకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. ఆ రెండు పార్టీలకు అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరుతుంది. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో పోరాటంపై పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకుంటారు. బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ దేశంలో విభజన రాజకీయాలు చేస్తున్నాయి. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకుంటున్నాం. భారత్ జోడో యాత్రతో ప్రజల్లో చైతన్యం నింపుతున్నాం. యాత్ర పొడవునా అందరూ చెప్పే మాటలు వింటా'నని రాహుల్ అన్నారు. 'మోదీ హయాంలో ప్రణాళికాబద్ధంగా రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేశారు. ఇది దేశానికి నష్టదాయకం. ఉద్యోగాల కల్పన లేకుండా చేశారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయి. సంపదను కొద్దిమంది వ్యాపారుల చేతుల్లో పెడుతున్నాయి. దేశ సమైక్యత కోసమే మేం భారత్ జోడో యాత్ర చేపట్టాం. బీజేపీ విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలనే మా ప్రయత్నం. కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ.. ఇక్కడ నియంతృత్వం ఉండదు. ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ అధ్యక్షుడిని ఎన్నుకుంది. కానీ బీజేపీ, టీఆర్‌ఎస్, ఇతర పార్టీలు ఎప్పుడైనా ఇలా ఎన్నుకున్నాయా? అవినీతిమయమైన, ప్రజాధనాన్ని లూటీ చేసే పార్టీలతో పొత్తు ఉండదు. రాజకీయంగా కొందరు నాయకులు ఎవరికి వారు తమది పెద్ద పార్టీగా ఊహించుకోవచ్చు. టీఆర్‌ఎస్‌కు కూడా తమకు తాము జాతీయ పార్టీ, గ్లోబల్(ప్రపంచ)పార్టీ అని ఊహించుకోవడంలో తప్పులేదు. చాలా సంవత్సరాల క్రితమే నేను భారత్ జోడో యాత్ర చేయాలనుకున్నా. కానీ, కోవిడ్ విజృంభించడం, ఇతర కారణాలతో చేయలేకపోయా. ఈ యాత్రతో వ్యక్తిగతంగా ఎన్నో నేర్చుకుంటున్నా, కాంగ్రెస్ పార్టీ ఉన్నతికి ఈ యాత్ర ఉపయోగపడుతుంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. భారత్ జోడో యాత్ర క్రీడా యాత్ర కాదు.. కచ్చితంగా రాజకీయ యాత్రే. ప్రస్తుతం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర కొనసాగించడమే నా లక్ష్యం. రాజకీయపరమైన అంశాలపై యాత్ర ముగిశాకే మాట్లాడుతా. ప్రజలతో మమేకమవడానికి ఈ యాత్ర గొప్ప ముందడుగు' అని రాసమావేశంలో టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్యం ఠాగూర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కేంద్ర మాజీమంత్రులు జైరాంరమేశ్, బలరాం నాయక్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతులేని విషాదం..

(మొదటిపేజీ తరువాయి)

మోర్బి బి డివిజన్ పోలీసు ఇనస్పెక్టర్ ప్రకాశ్ భాయి దేవకడియా తెలిపారు. సోమవారం సర్దార్ వల్లభాయి పటేల్ 147వ జయంతిని పురస్కరించుకొని కెవడియాలోని ఏక్తానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మోర్బి ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని అన్నారు. గుజరాత్ ప్రభుత్వానికి సహాయక చర్యలలో కేంద్రం కూడా సహకరించిందని చెప్పారు. ఏక్తానగర్‌లో ఉన్నాగానీ తన మనస్సంతా మోర్బిలోనే ఉందని, ఇంతటి బాధను జీవితంలో ఎప్పుడూ అనుభవించలేదని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటన క్రమంలో సోమవారం అహ్మదాబాద్‌లో జరగాల్సిన రోడ్ షోను మోదీ రద్దు చేసుకోగా రాష్ట్రంలోని ఐదు జోన్లలో కాంగ్రెస్ తలపెట్టిన పరివర్తన్ సంకల్ప్ యాత్ర కూడా రద్దు అయింది. ఇదిలావుంటే, మృతుల కుటుంబాలకు పీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని మోదీ ప్రకటించినట్లు పీఎంఓ వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మృతులకు రూ.4లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున ప్రకటించింది.

బాధ్యుల్ని ఉపేక్షించొద్దు: విపక్షాలు

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తున్న క్రమంలో ఆ రాష్ట్రంలో అన్ని పార్టీలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ప్రతిపక్షాల నాయకులు తీవ్రస్థాయిలో స్పందించారు. 'ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు' లేకుండానే వంతెనను ప్రజల సందర్శన కోసం తెరవడాన్ని ఆక్షేపించారు. వామపక్ష నేతలు వినయ్ విశ్వం (సీపీఐ), సీతారాం ఏచూరి (సీపీఎం), కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, మమతా బెనర్జీ (టీఆర్ఎస్), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్)తో పాటు వై.సతీశ్‌రెడ్డి (టీఆర్ఎస్), మనోజ్ సింగ్ (ఎస్పీ) తదితరులు ఘాటు విమర్శలు చేశారు. బీజేపీ ప్రభుత్వ తీవ్రస్థాయి నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దంపట్టిందని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శించారు. 'ఐదు రోజుల కిందట మరమ్మతులు జరిగాయని చెప్పారు. కాంట్రాక్టర్లకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది? పరిహారాన్ని మరింత పెంచాలి. నమ్మకమైన పద్ధతిలో పారదర్శకంగా దర్యాప్తు జరిపించి రాజకీయపరమైన జోక్యాన్ని బయట పెట్టాలి' అని ట్వీట్ చేశారు. 'ఇందుకు జవాబు దారీ ఎవరో తేల్చండి... బాధ్యులను ఉపేక్షిం చరాద'ంటూ సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. బాధితులకు చేతనైన సాయం చేయండంటూ కాంగ్రెస్ కార్యకర్తలకు ఆ పార్టీ ప్రస్తుత - మాజీ అధ్యక్షులు ఖర్గే, రాహుల్ పిలుపునిచ్చారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తుల నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండు చేశారు. దీనిని రాజకీయం చేయరాదన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా ప్రజా సందర్శనకు అనుమతులను రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలా ఇచ్చింది. ఇది నేరపూరితకుట్ర కాదా? తీవ్రమైన నిర్లక్ష్యం కాదా? ఈ విషాదానికి బాధ్యతను ఎవరు వహిస్తారు? జవాబుదారీ ఎవరిది? అంటూ ఆప్, టీఎంసీ, టీఆర్ఎస్, ఎస్పీ తదితర పార్టీల నేతలు ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. తీగల వంతెన కూలిన దుర్ఘటనకు సంబం ధించి గుజరాత్ పోలీసులు ఇప్పటివరకు 9మందిని అరెస్టు చేశారు. వంతెన నిర్వహించే కాంట్రాక్ట్ కంపెనీ ఒరెవా నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

వాస్తవ ప్రగతి చూపండి

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలనీ, సచివాలయాల్లో సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణకు మండలాల వారీగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఉండాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో సుస్థిర ప్రగతి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనపై సీఎం సమీక్షించారు. సమావేశానికి వివిధ శాఖాధిపతులు హాజరయ్యారు. గ్రామ, వార్డు సచివాలయాల రూపంలో మన ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలతో గొప్ప వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. అలాంటి గ్రామ, వార్డు సచివాలయాల నుంచి నిరంతర పర్యవేక్షణ, చేస్తున్న ప్రగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడమనేది చాలా ముఖ్యమైన అంశమని సూచించారు. లేకుంటే సుస్థిర ప్రగతి లక్ష్యాలను చేరుకునే ప్రయాణంలో వాస్తవికత దూరమవుతుందన్నారు. ప్రగతి లక్ష్యాల సాధనపై ప్రతి నెల రోజులకోసారి వివరాలు నమోదు కావాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే...వాటిని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలోనే గుర్తించి పరిష్కారాలు చూపాలని పేర్కొన్నారు. ఉదాహరణకు రక్తహీనతను నివారించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, దీనికోసం సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ అమలు చేస్తున్నామని, వాటిని అందుకుంటున్న మహిళల ఆరోగ్యంపై పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలన్నారు. ప్రభుత్వంలో వివిధ విభాగాల తరపున గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది ఉన్నారనీ, తాము అనుకుంటున్న లక్ష్యాల సాధనకు గ్రామ, వార్డు సచివాలయాలను చోదక శక్తిలా వాడుకుని అందులోని సిబ్బందిని పూర్తి స్థాయిలో భాగస్వాములు చేయాలనీ, సచివాయాల్లోని ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది పనితీరుపై పర్యవేక్షించాలని, దీనికి సంబంధించి ఎస్‌ఓపీలను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ప్రతి విభాగాధిపతి, ప్రతినెలలో రెండుసార్లు గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించాలని, ఆ శాఖకు చెందిన సచివాలయ ఉద్యోగులు ఏరకంగా పనిచేస్తున్నారో చూడాలన్నారు. దేశంలో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఓనర్‌షిప్ చేసుకోవాల్సిన అవసరముందని, ప్రతి ప్రభుత్వ విభాగానికి మండలాల వారీగా అధికారులను నియమించుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి నిర్దేశించిన ఎస్‌ఓపీలను మరోసారి పరిశీలించి వాటిలో మార్పులు, చేర్పులు అవసరమైతే చేయాలని, నెలకు కనీసం రెండు సచివాలయాలను ప్రభుత్వ విభాగాధిపతులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్లు, జేసీల పర్యవేక్షణపైనా పరిశీలించాలన్నారు. వ్యవసాయ, విద్య, మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్యం తదితర రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరహాగా దేశంలో ఏ ప్రభుత్వమూ ఖర్చు చేయడంలేదనీ, అందుకనే ఓనర్‌షిప్ తీసుకుని వాటిని సమగ్రంగా పర్యవేక్షించాల్సిన అవసరముందని సూచించారు. పిల్లలు బడి మానేశారన్న మాట ఎక్కడా ఉండకూడదనీ, డ్రాప్‌అవుట్స్ అన్న మాట ఎక్కడా వినిపించకూడదని చెప్పారు. సచివాలయాల, వలంటీర్ల వారీగా పర్యవేక్షించాలని, ఎక్కడైనా డ్రాప్‌అవుట్ జరిగిన ఘటన తెలిస్తే.. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు స్కూలుకు రాకపోతే ఎస్ఎంఎస్‌లు పంపాలని, ఇది కచ్చితంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కల్యాణమస్తు కోసం నిర్దేశించిన అర్హతలు బాల్యవివాహాల నివారణ, అక్షరాస్యత పెంపుకోసం తోడ్పాటునందిస్తాయని పేర్కొన్నారు. ఎస్డీజీ లక్ష్యాల్లో పర్యావరణం, పరిశుభ్రత అంశాలపైనా దృష్టి పెట్టాలని, గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత, వాయు కాలుష్యం నివారణ, రక్షిత తాగునీరు అంశాలపైనా దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాఠశాలల నిర్వహణలో ఉత్తమ విధానాలు పాటించడం ద్వారా నాణ్యమైన చదువులు ఉచితంగా అందుతాయని, దీనివల్ల చదువుల కోసం చేస్తున్న ఖర్చు భారం నుంచి ఆయా కుటుంబాలు ఉపశమనం పొందుతాయని పేర్కొన్నారు. విద్యారంగంలో అమలు చేస్తున్న సంస్కరణలతో రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సమీర్ శర్మ, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ఎస్ రావత్, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, ప్రణాళిక సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, పాఠశాల మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ జే నివాస్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ పి సంపత్ కుమార్, మహిళా శిశు సంక్షేమశాఖ సంచాలకులు డాక్టర్ ఎ.సిరి, మధ్యాహ్న భోజన పథకం సంచాలకులు నిధి మీనా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు రక్షణ కల్పిద్దాం

అంతర్జాతీయ సమాజానికి, ప్రభుత్వాలకు గుటెర్రస్ పిలుపు

ఐరాస: విధి నిర్వహణకు భయపడాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛా వాతావరణాన్ని పాత్రికేయులకు కల్పిద్దాం... సమాజానికి సేవ చేసే వారి వృత్తిని గౌరవిద్దాం అంటూ అంతర్జాతీయ సమాజానికి ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పాత్రికేయులపై పెరుగుతున్న నేరాలపై ఆందోళన వ్యక్తంచేశారు. రికార్డుస్థాయిలో జర్నలిస్టులు కటకటాలపాలయ్యారని, వార్తా సేకరణే వారి నేరమని, ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ చాలా ముఖ్యమని ఆయనన్నారు. పాత్రికేయులు హత్యలకు గురవుతుండటం, వారికి ప్రాణహాని ఉండటం, అనేకమంది బెదిరింపులు, నిర్బంధాలు, హింసకు గురి కావడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ధోరణి మారాలని సూచించారు. ఈ ఏడాదిలో 70మందికిపైగా జర్నలిస్టులు హత్యకు గురయ్యారని గుటెర్రస్ అన్నారు. పాత్రికేయులపై హింస, బెదిరింపులు పెరుగుతూనే ఉన్నాయని, వీరి రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి, అన్ని దేశాల ప్రభుత్వాలకు పిలుపునిచ్చారు. నవంబరు 2న అంతర్జాతీయ జర్నలిస్టుల దినోత్సవం నేపథ్యంలో గుటెర్రస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. 'ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ కీలకం. తప్పులు, నేరాలు, ఘోరాలను బహిర్గతం చేయడం, క్లిష్టప్రపంచానికి మార్గదర్శకత్వం- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల దిశగా పత్రికా స్వేచ్ఛ ముఖ్యమని గుటెర్రస్ నొక్కిచెప్పారు. వృత్తి ధర్మానికి కట్టుబడి ఉన్నప్పటికీ ఈ ఏడాది 70మందికిపైగా పాత్రికేయులు హత్యకు గురయ్యారని, వీటిలో చాలా వరకు కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. నిర్బంధానికి గురైన జర్నలిస్టుల సంఖ్య రికార్డుస్థాయికి చేరుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. తప్పుడు సమాచార వ్యాప్తి, ఆన్‌లైన్ బెదిరింపులు–వేధింపులు, విద్వేష ప్రసంగాలు (ముఖ్యంగా పాత్రికేయులు, మహిళలనుద్దేశించి) పెరిగాయని అన్నారు. ఈ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా మీడియా వర్కర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని తెలిపారు. చట్టపరంగా, ఆర్థికపరంగా ఇతరత్రా మార్గాల ద్వారా బెదిరించడం, వేధింపులకు గురి చేయడం కోసం అధికారాల దుర్వినియోగం పెద్దఎత్తున జరుగుతోందని, ఈ ధోరణి పాత్రికేయులకే కాదు యావత్ సమాజానికి ప్రమాదకరమని గుటెర్రస్ నొక్కిచెప్పారు. మీడియా వర్కర్లకు సురక్షితమైన స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించడమే పాత్రికేయుల సంరక్షణ కోసం ఐరాస కార్యాచరణ ప్రణాళిక లక్ష్యమని తెలిపారు. పాత్రికేయులకు రక్షణ కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు అంతర్జాతీయ సమాజానికి పిలుపునిస్తున్నాన న్నారు. జర్నలిస్టులు తమ విధినిర్వహణకు భయపడే పరిస్థితి ఉండకూడదని నొక్కిచెప్పారు. జర్నలిస్టులపై నేరాల ముగింపు ఉద్దేశంతో పాటించే అంతర్జా తీయ పాత్రికేయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మీడియా వర్కర్లను గౌరవిద్దాం... నిజం, న్యాయం, అందరికి మానవహక్కుల పక్షాన నిలుద్దాం' అంటూ గుటెర్రస్ పిలుపునిచ్చారు.

ఐజేయూ ప్లీనరీలో పాల్గొన్న ఏపీ ప్రతినిధులు

జర్నలిజం పరిరక్షణకు ప్రచారాందోళన

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వాములు చేయాలని నిర్ణయించింది. పాత్రికేయులు పెద్దఎత్తున పాల్గొనాలని ప్లీనరీ పిలుపునిచ్చింది. కేంద్ర కార్మికసంఘాల సంయుక్త వేదిక అక్టోబరు 28న కార్మిక ఉపాధి శాఖ మంత్రికి సమర్పించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌కు ఐజేయూ ప్లీనరీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏడేళ్లుగా జరపకపోవడాన్ని తప్పుపట్టింది. దీనిని వెంటనే నిర్వహించాలని, వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమ ప్రతినిధిగా ఐజేయూకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరింది. అలాగే, మీడియా–సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వక విద్వేష ప్రచారాన్ని అరికట్టాలి; మీడియాలో అసభ్య, అశ్లీల, నిందాపూర్వక భాషను నివారించాలి; రిటైర్డ్ పాత్రికేయులకు సార్వత్రిక పింఛను పథకం అమలు చేయాలి; ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేరును మీడియా కౌన్సిల్‌గా మార్చి... ఎలెక్ట్రానిక్, వెబ్ మీడి యాలను దాని పరిధిలోకి తేవాలి; దేశంలో మీడియా స్థితిగతులను అధ్యయనం చేసేందుకు కొత్త ప్రెస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండు చేసింది. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మూడురోజుల సమావేశాలకు 16 రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్ జమ్ము ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికపై చర్చలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో ప్రముఖ సంఘసేవకురాలు, వర్ధమాన పారిశ్రామికవేత్త డా.లీమా రోజ్ మార్టిన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ నవాజ్ ఘని, ఐజేయూ పూర్వాధ్య క్షులు ఎస్ఎన్.సిన్హా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ కౌన్సిల్ సభ్యులు ఎంఏ మాజిద్, జాతీయకార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, ట్రైబ్స్ న్యూస్ సంపాదకుడు ఆలపాటి సురేశ్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్, త్సేవాంగ్ రిగ్జిన్, రిగ్జిన్ వాంగ్మూ, బిందూ సింగ్, ప్రితమ్ సింగ్ రుపాల్, రమేశ్ శంకర్ పాండే, జి.ప్రభాకరన్, సంజయ్ శర్మ, విజయ్ సింగ్, ప్రమోద్ కుమార్ ఝా, తమిళనాడు యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు డీఎస్ఆర్ సుభాశ్, పాండిచేరి యూనియన్ అధ్యక్షుడు మత్తి మహారాజ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, మహారాష్ట్ర సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ మాట్లాడారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆత్మహత్యల్లోకి నెట్టకండి

- డిపాజిట్‌దారులందరికీ సత్వరం డబ్బు చెల్లించాలి
- హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో కేసు విచారించాలి
- ఉన్నతాధికారుల కమిటీ సమస్యలు పరిశీలించాలి
- డిసెంబరు నాటికి పూర్తి పరిష్కారం చేయాలి
- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ల ద్వారా సీఎంకు వినతుల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని, డిసెంబరు నాటికి రూ.20వేలపైన డిపాజిట్ చేసిన ఖాతా దారులందరికీ పూర్తి మొత్తాలను విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించి, ఆత్మహత్యలు జరగకుండా కాపాడాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోని తహసీల్దార్ల ద్వారా, తాడేపల్లిలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి సోమవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో పెద్దఎత్తున వినతులు పంపారు. విజయవాడ అర్బన్ తహసీల్దార్‌కు స్థానిక అగ్రిగోల్డు బాధితులు, సీపీఐ, అనుబంధ సంఘాల నేతలతో కలిసి ముప్పాళ్ల నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. అనంతరం ముప్పాళ్ల నాగేశ్వర రావు మీడియాతో మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లో పూర్తి న్యాయం చేకూరుస్తామని, కోర్టు విషయాన్నీ, కంపెనీ సంగతీ తాను చూసుకుంటానని సీఎం జగన్ గత ఎన్నికల ముందు పదేపదే ఆయా సభల్లో హామీ లిచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేనందున ఈనెల 16న ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన నాగ సుబ్బమ్మ తరహా ఆత్మహత్యలు పునరావృతమవుతాయనే తీవ్ర ఆందోళనలతో బాధితులు న్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ కేసు విచారణ చేస్తున్న ఏలూరు కోర్టులో తరచూ వాయిదాలు పడుతూ కాలయాపన జరుగుతోందన్నారు. ప్రభుత్వం తరపున న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది చొరవ చేసుకుని సత్వంర విచారిం చేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కేసును రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరపాలన్నారు. రూ.20వేలపైన డిపాజిట్ చేసిన ఖాతాదారులందరికీ పూర్తి మొత్తాలను విడుదల చేసి మేలు చేకూర్చాలని పేర్కొన్నారు. చెక్కులు బౌన్స్ అయిన బాధితులందరికీ, బాండ్లు, రసీదులు పోగొట్టుకున్న వారికీ, బాండ్ల స్థానంలో కంపెనీ ఇచ్చిన పే ఆర్డర్లు, సెటిల్‌మెంట్ వోచర్లు, సీఆర్ స్లిప్పులు తదితర సమస్యల అర్జీలను పరిశీలించి వారందరికీ డబ్బు చెల్లించేలా ఏర్పాటు చేయాలన్నారు. రూ.20వేలలోపు బాధితులకు వివిధ కారణాలతో మిగిలిపోయిన పేద, పొదుపు దారులందరికీ సత్వరమే డిపాజిట్ సొమ్ము చెల్లింపు జరిగేలా ఆదేశించాలన్నారు. ఒకేపేరున ఒకటికి మించి బాండ్లు ఉన్నప్పటికీ డబ్బు చెల్లించి మేలు చేకూర్చాలని కోరారు. కస్టమర్ల ఒత్తిడితో తల తాకట్టు పెట్టి, వారికి చెల్లించిన ఖాతాల తాలూకా డబ్బును నేరుగా ఏజెంట్లకు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, ఇందుకు ఉదాహరణగా ఆయన వివరిస్తూ...విశాఖ జిల్లాలోని యారాడ, మన్యం జిల్లాలోని నాగవల్లి ప్రాజెక్టు, వైఎస్ఆర్ కడపజిల్లాలోని పొద్దుటూరు తదితర ఆస్తుల విషయంపై తక్షణమే విచారించాలన్నారు. అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిని, వారికి సహకరిస్తున్న సీనియర్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అటాచ్‌మెంట్ చేసిన వేలాది కోట్ల రూపాయల కంపెనీ ఆస్తులను విక్రయించిగానీ, తనఖా పెట్టిగానీ, ప్రభుత్వమే కొనుగోలు చేసుకునిగానీ బాధితుల సొమ్ము సత్వరమే ఇప్పించాలన్నారు. వివిధ స్కీముల పేరుతో అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీ నిర్ణయించిన ఇంటి స్థలాలు, కౌలు భూములు, స్కీములలో కొనుగోలు చేసిన వారికి, ఎకో చందన వనం స్కీములో స్థలాలు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయించి న్యాయం చేయాలన్నారు. స్థలాలు రిజిస్టర్ అయిన వారికి భూములు స్వాధీన పరుచుకునేట్లుగా కొంత మొత్తాలను చెల్లించిన వారికి మిగిలిన మొత్తాన్ని కట్టించుకుని స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించి కోర్టు ద్వారా వారికి పూర్తి హక్కులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు ఆత్మహత్యల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఆది నుంచి అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతిస్తోందన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి బాధితుల సమస్యల్ని పరిష్కరించాలని, లేకుంటే బాధితులు చేపట్టే మరో ఉద్యమానికి సంఘీభావం తెలుపుతామన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ దుర్గాభవానీ మాట్లాడుతూ, నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులు రోడ్డెక్కారని, తక్షణమే వారి సమస్యల్ని సీఎం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యుడు తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, నగర నాయకులు దోనేపూడి సూరిబాబు, ఎస్‌కే అఫ్సర్, మహిళా సమాఖ్య నాయకులు దుర్గాసీ రమణమ్మ, చింతాడ పార్వతి, పుష్పావతి, ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, బి.శ్రీనివాసరావు, లంకే సాయి, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుధీర్, జగదీశ్, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర నాయకులు షేక్ షరీఫ్, కె.మణికంఠ, ఏఐటీయూసీ నగర నాయకులు వియ్యపు నాగేశ్వరరావు, పి.రాణి, అగ్రిగోల్డ్ బాధితులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ హెల్త్‌లో రెండు గ్లోబల్ అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వైద్యరంగం అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంస్కరణలు, అందరికీ వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రెండు గ్లోబల్ డిజిటల్ హెల్త్ అవార్డులు లభించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ డిజిటల్ హెల్త్ సమ్మిట్- 2022లో అవార్డులను వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని అందుకున్నారు. ఈ మేరకు సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసి అవార్డుల వివరాలను మంత్రి రజిని, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల్లో సీనియర్లకు న్యాయం చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిబంధనలు పొందుపరచాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో తెలుగు, హిందీ, వ్యాయామ స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి సీనియర్లు, జూనియర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 2020 బదిలీ కౌన్సిలింగ్ నిలిచిపోయిందన్నారు. సీనియర్లకు న్యాయం జరగాలంటే ప్రస్తుతం 2022 బదిలీ కౌన్సెలింగ్‌లో వారికి అవకాశం కల్పించి పాత స్కూలు, సర్వీస్ పాయింట్లు కలపాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన జిల్లాలలో కూడా ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే, అక్కడ సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం బదిలీల నిబంధనలు రూపొందించాలన్నారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో విధులు నిర్వహించే సైనికుల కుటుంబాలకు చెందిన ఉపాధ్యాయులకు కూడా ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

దుబాయ్‌కు విమాన సర్వీసులు

విశాలాంధ్ర-గన్నవరం: విజయవాడ నుంచి దుబాయ్ వెళ్లే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేలా గన్నవరం విమానాశ్రయం నుంచి వారానికి రెండు విమానాలు నడుపుతున్నట్టు బందరు ఎంపీ, ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. దుబాయ్ ప్రయాణీకులకు సోమవారం బోర్డింగ్ పాస్‌లు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ సోమవారం, శనివారం దుబాయ్‌కు విమానాలు నడుపుతున్నట్టు చెప్పారు. ప్రయాణికులు పెరిగితే విమానాల సంఖ్య పెంచుతామని తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి దుబాయ్ వెళ్లే ప్రయాణికులకు గన్నవరం విమానా శ్రయం దగ్గరగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే దుబాయ్ నుంచి వివిధ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు కూడా సౌలభ్యకరమన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, తోట వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.15 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని సీఎం జగన్ ఎగురవేస్తారు. ఆ తర్వాత తెలుగు తల్లికి, అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులర్పిస్తారు.

కాపుల అణచివేతే జగన్ లక్ష్యం: కళా వెంకట్రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాపులను అణచివేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడున్నరేళ్ల పాలనలో కాపుల కోసం జగన్ ఏం చేశారో చెప్పాలన్నారు. వంగవీటి రంగాను హత్య చేయడంలో తప్పు లేదన్న గౌతంరెడ్డిని ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని, రంగా హత్యలో దేవినేని నెహ్రూకు సంబంధం ఉందని ఆయన కొడుకు అవినాష్‌ను పార్టీలో చేర్చుకున్నారని విమర్శించారు. గతంలో రాజంపేట ఎంపీ టికెట్ బలిజలకు ఇచ్చేవారని, జగన్ వచ్చాక పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఇచ్చారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయుడిపై బాంబు దాడులు చేయించారన్నారు. కోనసీమ, విశాఖ, చిత్తూరు జిల్లాలలో కాపులు, బలిజలపై అక్రమ కేసులు పెట్టించి వేధించారని దుయ్యబట్టారు. తిరుపతిలో చిరంజీవి బసచేసిన హోటల్‌పై దాడి చేయించారని, తునిలో రైలు దగ్ధం చేసి కాపు యువతను ఇరికించారని విమర్శించారు. ఇన్ని రకాలుగా అవమానించిన జగన్‌కి వైసీపీలో ఉన్న కాపు నేతలు ఊడిగం చేస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగాల్లో కాపులకు చంద్రబాబు ఇచ్చిన ఐదుశాతం రిజర్వేషన్లు ఎత్తేస్తే ఎవరూ నోరెత్తలేదని, రాజకీయ లబ్ధి కోసం కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ కుట్రలు చేస్తున్నారని వెంకట్రావు వ్యాఖ్యానించారు.

కార్మికుల హక్కులను కాపాడుకుందాం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి
ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - తిరుపతి : కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి, కార్మిక హక్కులను కాపాడుకోవడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరినాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగర కార్యదర్శి ఎన్.డి. రవి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహిం చారు. తొలుత సీపీఐ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని, ఏఐటీయూసీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం కృష్ణాపురం ఠాణా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులు మహాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో హరినాథ్‌రెడ్డి ప్రసంగిస్తూ, 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన కార్మికుల మొట్టమొదటి సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించి కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా నిలిచింది అని అన్నారు. నాటి నుంచి కార్మిక హక్కులు, చట్టాల కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. నేటి మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం మంచిది కాదని హెచ్చరించారు. మోదీ దురాగతాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే సంక్షేమ బోర్డు నిధుల నుంచి రూ.29 వేల కోట్లు కేంద్రం, రూ.12 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించాయని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే కుమార్ రెడ్డి, కే రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి జే విశ్వనాథ్, ప్రజానాట్యమండలి ఏపీ ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎండి రవి, కేవై రాజా, ఎం. శివ, సిహెచ్ .శివకుమార్, మహేంద్ర గోవింద స్వామి, ఏపీ మహిళా సమైక్య నాయకురాలు బీ నదియా, ఎన్ మంజుల, ప్రమీల, హరిత, విజయ, అలివేలు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీ రవి, జె నాగరాజు, పీ గురవయ్య, డప్పు సూరి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపైనే పోరాటం

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవంలో 'వెలుగూరి'

విశాలాంధ్ర-గుంటూరు: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలపై తాము పోరాటాలు కొనసాగి స్తామని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవా ధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం ఏఐటీయూసీ 103వ వ్యవస్థా పక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ పతాకాన్ని రాధాకృష్ణమూర్తి ఎగురవేశారు. అనంతరం సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో వెలుగూరి మాట్లాడుతూ, 103 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కార్మికులందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి పోరాటం నిర్వహిం చిందని గుర్తుచేశారు. కానీ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్ని రద్దుచేసి రాక్షస ఆనందాన్ని పొందుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు చెందాల్సిన దేశ సంపద మొత్తాన్ని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి వ్యక్తులకు తాకట్టు పెడుతుందని, దీన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. సంఘం జిల్లా కన్వీనర్ హనుమంతరావు, నగర గౌరవాధ్యక్షుడు సురేష్ బాబు, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాంప్రసాద్, మంగా శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు బందెల రవికుమార్, కోటి వీరాంజనేయులు, పచ్చల శివాజీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, ఎస్‌కే వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, కార్పెంటర్ యూనియన్ నాయకులు కాయల రామారావు, దేగల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టు అమలుకు

25న చలో పార్లమెంట్ మార్చ్

ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి 'గుజ్జుల'



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టు అమల్లోకి తేవాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 25న తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశాన్ని సోమవారం గూగుల్ మీట్ ద్వారా రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ, మోదీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని ప్రకటించి, ఎనిమిదేళ్లు అవుతున్నప్పటికీ ఒక్క ఉద్యోగమూ ఇవ్వకపోగా నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే ... పకోడీ బండ్లు పెట్టుకుని బతకండి అంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఖాళీగా ఉన్న 27 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడంతో పాటు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. పార్లమెంట్ మార్చ్‌కు నిరుద్యోగ యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, సంతోష్ కుమార్, జి.నాగ రాముడు, కత్తి రవి, గంగా సురేష్, వై.బాబి, షేక్ సుభాని, మొజ్జాడా యుగంధర్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు నూతన పాలసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మద్య నియంత్రణ విధానానికి అనుగుణంగా కల్లు గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 2022-27కు కల్లుగీత విధానం(పాలసీ) ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. కల్లు గీత కార్మిక సొసైటీలు, గీచే వానికి చెట్టు పథకం, షెడ్యూలు ప్రాంతాల్లో షెడ్యూలు జాతుల వారు, కల్లు గీత గీసుకోవడం కోసం ఐదేళ్లకుగాను లైసెన్సు ఇస్తారు. కల్లు రెంటల్స్ పూర్తిగా రద్దు చేశారు. కల్లు గీస్తూ, ప్రమాదానికి గురై శాశ్వత అంగ వైకల్యం పొందిన గీత కార్మికులకు ప్రత్యామ్నాయ నైపుణ్యాభివృద్ధిని నైపుణ్య, సంబంధిత విభాగం ద్వారా తగిన శిక్షణ ఇప్పించి, ప్రత్యామ్నాయ, ఆదాయ మార్గాలను చూపిస్తారు. వారికి నష్టపరిహారాన్ని వైఎస్ఆర్ బీమా ద్వారా కల్పిస్తారు. కల్లు గీస్తూ ప్రమాదవశాత్తూ మరణించినా, గీత కార్మికులకు ఇచ్చే నష్టపరిహారం/ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారు. దీనిలో రూ.5లక్షలు వైఎస్ఆర్ బీమా ద్వారా, మిగిలిన రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. కల్లుగీత కార్మికుడు సహజ మరణం పొందితే, అతని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా లభించే నష్టపరిహారం అందిస్తారు. ఎన్ఆర్ఇజిఎం, షెల్టర్ బెడ్ అభివృద్ధి ద్వారా తాటి, ఈత వంటి కల్లుగీత చెట్లను విరివిగా పెంచి, నదీ తీరాలు, సాగర తీరాలను పటిష్ఠం చేస్తూ కల్లుగీతకు కావాల్సిన వనరులను సమృద్ధిగా పెంపొం దిస్తారు. ఈ విధానాల వల్ల రాష్ట్రంలోని 95,245 మంది కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. లైసెన్సింగ్ విధానం అత్యంత పారదర్శకంగా ఉండేందుకుగాను అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

నేడు వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, విశేష కృషి చేసిన 35 మంది వ్యక్తులు, సంస్థలకు వరుసగా రెండో ఏడాది వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్ మెంట్, వైఎస్సార్ అచీవ్ మెంట్ - 2022 కింద అత్యున్నత పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ అవార్డుల ప్రదానోత్సవానికి రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా సీఎం జగన్, ఆత్మీయ అతిథిగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ హాజరుకానున్నారు. వ్యవసాయం, కళలు, సంస్కృతి, సాహిత్యం, మహిళా శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమలు వంటి రంగాలలో అసాధారణ నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలు ప్రదర్శించి సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసిన 35 మంది వ్యక్తులు, సంస్థలను అవార్డులు వరించాయి. వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు లో భాగంగా కళలు, సంస్కృతి విభాగంలో దర్శకులు, నటులు, కళాతపస్వి డా. కె. విశ్వనాథ్, తన చిత్రాల ద్వారా సామాజిక చైతన్యం కలిగిస్తున్న దర్శకుడు, నటుడు ఆర్ నారాయణమూర్తికి ఈ అవార్డు లభించింది. సాహిత్య రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఎమెస్కో పబ్లిషింగ్ హౌస్‌కు అవార్డులు దక్కాయి. రాయలసీమకు సంబంధించిన ప్రసిద్ధ రచయిత డా.శాంతి నారాయణకు అవార్డు లభించింది.

ఆంగ్లభాషను అందరికీ చేరువ చేయడం అభినందనీయం

అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

విశాలాంధ్ర-విశాఖసిటీ: ఆంగ్లభాషను అందరికీ చేరువచేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడు తున్న సంస్కరణలు అభినందనీయమని అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. భారతీయ విద్యార్థులకు అమెరికా అందిస్తున్న ఆంగ్ల భాష శిక్షణ తరగతుల ప్రగతిని పరిశీలించడానికి విచ్చేసిన ఆమె సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏపీలో తాను సందర్శించిన తొలి విశ్వవిద్యాలయం ఏయూ అన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆంగ్ల భాషను చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొన్ని రోజుల క్రితం తాను సీఎం జగన్‌ను కలిసినట్టు చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని వీసీ ఆమెకు వివరించారు. అమెరికా విశ్వవిద్యాలయాలతో అవగా హన ఒప్పందాలు చేసుకుని సంయుక్తంగా కోర్సుల నిర్వహణ దిశగా పనిచేస్తున్నామన్నారు. ఏయూలోని ఇంక్యుబేషన్, స్టార్టప్‌లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్టార్టప్ రంగంలో అమెరికా విశ్వవిద్యాలయాల విద్యార్థులతో, స్టార్టప్ సంస్థలతో కలసి పనిచేస్తామని వివరించారు. అనంతరం

అమెరికన్ కార్నర్‌ను జెన్నిఫర్ లార్సన్ సందర్శించారు. గ్లోబల్ వర్చువల్ స్కూల్ ఇంగ్లీష్ ప్రోగ్రాంలో భాగంగా ఆంగ్ల భాషలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అమెరికాలో విదేశీ విద్య అవకాశాలు, ఎంపిక విధానం తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర విధానాలు దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారం 627వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట్లాది రూపాయలు టర్నోవర్ సాధిస్తూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కాపాడు కుంటామని అన్నారు. ప్రభుత్వ రంగాలన్నింటినీ కుదేలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఐక్యంగా చేస్తున్న దీక్షల వల్ల కేంద్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై పునరాలోచనలో పడిందన్నారు. లాభాలార్జిస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. నాణ్యత కలిగిన ఉక్కును తయారు చేయడంలో దిట్ట అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగే వరకు పోరు సాగిస్తామని అన్నారు. నాయకులు జె.రామకృష్ణ , వరసాల శ్రీనివాసరావు, పి.పెద్దిరాజు, డి.దేముడు, జి.ఆనంద్, మోహన్ కుమార్, రాజేశ్వరరావు, వర్మ , ఆర్.ధనరాజు, వి.కృష్ణం నాయుడు, ఆర్.సూరిబాబు, వైవి సుబ్బారావు, డి.సన్ని బాబు, పి.వి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోర్బీ విషాదం

గుజరాత్ లోని మోర్బీ పట్టణంలో మచ్చూ నది మీద ఉన్న 143 ఏళ్ల నాటి ఊయల లాంటి వంతెన ఆదివారం సాయంత్రం కూలిపోయింది. కనీసం 141 మంది ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ వంతెనను మరమ్మతుల కోసం ఏడు నెలలపాటు మూసేసి వారం కిందట అంటే అక్టోబర్ 26న పునఃప్రారంభించారు. ఈ ప్రమాదానికి కారణమేమిటో కనుక్కోవడానికి కచ్చితంగా దర్యాప్తు జరుగుతుంది. ఈ దుర్ఘటన గురించి జనం అంతా మరిచిపోయే సమయానికి నివేదిక వస్తుంది. ఇలాంటి సందర్భాలలో వాస్తవానికి బహు దూరంగా ఉండే నివేదికే బయటకు వస్తుంది. ప్రమాదానికి అసలు కారకుల ఆచూకీ ఆ నివేదికలో ఎంత తరచి చూసినా దొరకదు. పర్యాటకులను ఆకర్షించడం కోసం నిర్మించే ఇలాంటి వంతెనల మీద ఒకే సమయంలో ఎంత మంది ఉండొచ్చో ఓ లెక్క ఉంటుంది. దాని సామర్థ్యం మీద ఈ నివేదికలో వెల్లడించే అంచనాలు కనీసం భవిష్యత్తులోనైనా ఈ దారుణాలు జరగకుండా ఉపయోగపడకపోవడం మన ప్రత్యేకత. బాధితులను రక్షించడానికి, పునరావసం కల్పించడానికి ఏ లోటు చేయబోమని ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చారు. గుజరాత్ శాసనసభ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కోడి ఇంకా కూయలేదు కానీ పదిహేను రోజులకు ఒక సారి మోదీ గుజరాత్ లో పర్యటిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే ప్రమాదం జరిగినప్పుడు ఆయన అక్కడే ఉన్నారు. మోర్బీ మాజీ పాలకుడు సర్ వాఘ్జీ ఠాకూర్ మోర్బీ పాలకుల ప్రగతి శీల, శాస్త్రీయ పరిపాలనకు చిహ్నంగా ఈ వంతెనను నిర్మించారు. 1879 ఫిబ్రవరి 20న అప్పటి ముంబై గవర్నర్ రిచర్డ్ టెంపుల్ ఈ వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తరా ఖండ్ లోని రాం-లక్ష్మణ్ ఝూలాల నమూనాలో ఈ వంతెన నిర్మించారు. అప్పటికి యూరప్ లో అందుబాటులో ఉన్న మేటి సాంకేతికతను వినియోగించి నిర్మించారు. దీనికోసం అవసరమైన నిర్మాణ సామాగ్రి ఇంగ్లాండ్ నుంచి మూడున్నర లక్షల రూపాయలు పెట్టి తెప్పించారట. అప్పటి రాజ కుటుంబాల దర్బార్ గఢ్ రాజభవనాన్ని, నజర్ బాగ్ రాజభవనాన్ని కలపడానికి ఈ వంతెన నిర్మించారు. ఈ వంతెన 233 మీటర్ల పొడవు ఉంటుంది కానీ వెడల్పు కేవలం 1.25 మీటర్లే. అందువల్ల ఎక్కువ మంది ఒకే సారి ఆ వంతెన మీదకు వెళ్లడం ప్రమాదకరం. ఆదివారం సాయంత్రం ప్రమాదం జరిగినప్పుడు నాలుగైదు వందల మంది వంతెన మీద విహార యాత్రకు వచ్చారట. ఈ వంతెనకు ఇటీవలే మరమ్మతులు చేయించారు. గుజరాత్ కు చెందిన ఒరేవా అనే ప్రైవేటు కంపెనీ ఈ వంతెనను నిర్వహిస్తుంది. అవసరమైన మరమ్మతుల బాధ్యత కూడా ఆ సంస్థదే. అయితే ఒరేవా కంపెనీ నిర్మాణ రంగంలో నైపుణ్యం ఉన్నది కాదు. నిజానికి ఒరేవా కంపెనీ గడియారాలు, ఎలక్ట్రిక్ స్కూటర్లు తయారు చేస్తుంది. ఈ వంతెన నిర్వహణ తమ వ్యాపార నైపుణ్యాలకు సంబంధించింది కాదు గనక దేవ్ ప్రకాష్ సొల్యూషన్స్ అనే ప్రైవేటు కంపెనీ సహాయం తీసుకుంటుంది. ఈ వంతెనకు ఇటీవలే మరమ్మతులు చేయించిన తరవాత కనీసం ఫిట్నెస్ సర్టిఫికేట్ కూడా తీసుకోకపోవడం ప్రైవేటు కంపెనీల వ్యవహార సరళికి, వాటిని విచ్చలవిడిగా ప్రోత్సహించే ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, బాధ్యతా రాహిత్యానికి తార్కాణం. గుజరాత్ నూతన సంవత్సరాదిని దృష్టిలో ఉంచుకుని అక్టోబర్ 26న ఈ వంతెనను ప్రారంభించేశారు. ఈ కంపెనీ కుదుర్చుకున్న కాంట్రాక్టు ప్రకారం మరమ్మతులు మొదలైనవి చేయడానికి కనీసం ఎనిమిది నెలలనుంచి ఏడాదిపాటు మూసి వేసి ఉండాల్సింది. భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకుండా పంచాంగాల ఆధారంగా గుజరాత్ సంవత్సరాది అని హడావుడిగా వంతెన మీదకు జనాన్నీ అనుమతించడం విచిత్రంగా ఉంది. పైగా ఈ వంతెన మరమ్మతులకు రెండు కోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టినందువల్ల ఒరేవా కంపెనీ టికెట్ డబ్బులూ వసూలు చేస్తుంది. పదిహేనేళ్ల పాటు టికెట్ ధర తమ ఇష్టానుసారం పెంచుకోవడానికి దయగల ప్రభువుల అనుమతి ఉంది.

రాజ్ కోట్ నుంచి లోకసభకు ఎన్నికైన బీజేపీ ఎంపీ మోహన్ కుందరియా కుటుంబానికి చెందిన 12 మంది ఈ దుర్ఘటనలో మరణించారు. అందులో అయిదుగురు బాలలు, నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. సహాయ, పునరావాస కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండడానికి దుర్ఘటన జరిగిన వెంటనే మోదీ ఆ ప్రాంతాన్ని సందర్శించలేదు. సోమవారం సందర్శించారు. 2016 లో బెంగాల్ శాసనసభ ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలోనే వివేకానంద ఫ్లై ఓవర్ కూలిపోయింది. అప్పుడు ప్రధానమంత్రి మోదీ బెంగాల్ ముఖ్యమంత్రిని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇది దైవ ఘటన కాదు, మానవ తప్పిదం అని తూర్పారబట్టారు. మమతా బెనర్జీ కూడా తక్కువ తినలేదు. ఆ ఫ్లై ఓవర్ నిర్మాణానికి కాంట్రాక్టు మంజూరు చేసింది వామపక్ష ఫ్రంట్ అధికారంలో ఉన్నప్పుడే కనక ఈ దుర్ఘటనకు వారిదే బాధ్యత అని దుమ్మెత్తి పోశారు. మరి గుజరాత్‌లో వంతెన కూలిపోవడానికి నెపం ఆయన ఎవరి మీద తోస్తారో తెలియదు. మోదీ నిరంతరం ఎన్నికల ప్రచార ఊపులోనే ఉంటారు. కనక అప్పుడు వివేకానంద ఫ్లై ఓవర్ కూలిపోవడం తృణమూల్ అక్రమ పరిపాలనను ఖండించడానికి దేవుడు ఇచ్చిన సంకేతం అన్నారు. ఇప్పుడూ అదే సూత్రాన్ని వర్తింప చేస్తే రెండు దశాబ్దాలకు పైగా గుజరాత్ లో అధికారం చెలాయిస్తున్న మోదీ నాయకత్వంలోని బీజేపీనే తప్పుబట్టాలా! విషాదకర పరిణామాలను కూడా ఎన్నికల ప్రయోజనాలకోసం వినియోగించు కోవడంలో దిట్ట అయిన మోదీ లాంటి వారు మినహా ఎవరూ అంతటి దుర్మార్గానికి పాల్పడరు. మానవ జీవితంలో విషాద సంఘటనలను కూడా పరిహసించే కుసంస్కారం అందరికీ ఉండదు కదా! కోల్కతా ఫ్లై ఓవర్ కూలిపోయినప్పుడు రెండు కన్నీటి బొట్టైనా కార్చాలి కదా అని మమతా బెనర్జీని ఎద్దేవా చేసిన మోదీ మోర్బీ వంతెన కూలి పోయిన తరవాత సహాయ, పునరావాస కార్యకలాపాల్లో లోటుఉందని అన్నారు తప్పితే కన్నీటిబొట్లు రాల్చిన దాఖలా లేదు.

గుజరాత్‌లో అధికారంలో ఉన్న తమ పార్టీ ప్రభుత్వంలోని లోపాలు ఆయనకు ఎటూ కనిపించవు. భారత్ జోడో యాత్రలో భాగంగా హైదరాబాద్ మీదుగా వెళ్తున్న రాహుల్‌ను మోర్బీ దుర్ఘటనపై వ్యాఖ్యానించ మని కోరితే తాను ఈ దుర్ఘటనను రాజకీయం చేయబోనని కచ్చితంగా చెప్పేశారు. కాంట్రాక్టులు కేటాయించడంలో కమిషన్లకు ఆశ పడడం, బాహాటంగా అవినీతిని ప్రోత్సహించడం కేవలం బీజేపీ ప్రభుత్వాలకే పరిమితమైన వ్యవహారం కాదు. దాదాపు అన్ని ప్రభుత్వాలు అవినీతిని చేతులు చాచి ఆహ్వానిస్తూనే ఉంటాయి. మానవ తప్పిదాలను నివారించ డానికి ఏ ప్రభుత్వమైనా ఎందుకు శ్రద్ధ తీసుకోదో అంతుబట్టదు.

కొలువులు 75 వేలేనా!

జ్ఞాన్‌పాలక్

ప్రధాని నరేంద్ర మోదీ భోపాల్‌లో అక్టోబర్ 22, 2022న "రోజ్‌గార్ మేళా" (ఉద్యోగాల పంపిణీ సంత)ను ప్రారంభించారు. గత ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల కల్పనకోసం చేసినకృషిని ప్రశంసించడానికి మీడియా కవరేజీ కోసం ఆయన భక్తులతో తెగ ఆర్భాటం చేశారు. ఫోటో-సెషన్‌లతో ప్రచారం చేశారు. 2014 లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో నిరుద్యోగం గరిష్టానికి చేరింది. 2018లో 6.2 శాతంతో కాస్త తగ్గిన నిరుద్యోగ సమస్య అక్టోబర్ 24, 2022 నాటికి 7.9 శాతానికి పెరిగింది.

దేశంలో ఉపాధిరంగం తీవ్ర అస్థిరతకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో చేపట్టిన ఉద్యోగమేళా మోదీప్రభుత్వంచేస్తున్న కుటిల యత్నాలకు మచ్చుతునక. "ఉద్యోగాల పంపిణీ కోసం మేళాలు" నిర్వహించడం మోదీ ప్రభుత్వపేలవమైన ప్రత్యామ్నాయమే. ఏళ్లతరబడి కోట్లాదిమంది నిరుద్యోగులుగా ఉన్న సమయంలో ప్రస్తుత మేళాలో కేవలం 75,000 ఉద్యోగాలు మాత్రమే కల్పించారు. 2013 లో కార్మిక విధానాలపై అత్యున్నత త్రైపాక్షిక సంస్థ అయిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సీ) సిఫార్సు చేసినప్పటికీ, అందరికీ ఉపాధి కల్పన దిశగా భారత పార్లమెంటులో జాతీయ ఉపాధి విధానాన్ని రూపొందించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యమే.. 2022 ఆగస్టులో మోదీ ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కార్మిక సదస్సు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఒకటి కాదు. జాతీయ కార్మిక సదస్సును సంప్రదించకుండా తీసుకొచ్చిన నాలుగు వివాదా స్పద లేబర్ కోడ్‌లను అమలు చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యం. ఇవి కార్పొరేట్‌రంగం అనుకూలం. తత్ఫలితంగా ప్రస్తుతంపరిస్థితి కంటే మరింత వేగంగా నిరుద్యోగ సమస్య ప్రబలే అవకాశం ఉంది. 2022 ఫిబ్రవరిలో, గ్రామీణ భారతదేశంలో ఉపాధి హామీ పథకంలో (ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఏ) బడ్జెట్‌ను 25శాతానికి తగ్గించింది. ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఏ గ్రామీణ భారతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కేటాయించిన ప్రత్యేక పథకం. ఇది డిమాండ్ ఆధారిత పథకం కాబట్టి, ఈ పథకంలో పనిని డిమాండ్ చేయకూడదని కార్మికులను నిరుత్సాహపరిచేందుకు మోదీ ప్రభుత్వంలో అన్నిప్రయత్నాలు జరిగాయి. వాటిలో ప్రధానమైనది నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం.దీనిని గతసంవత్సరం "ఆధునిక బానిసత్వం"గా భారత సుప్రీంకోర్టు పేర్కొంది.

.దీనికి తోడు దేశంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం కోసం తాము తీవ్రంగా కృషి చేస్తున్నామని చెప్పడానికి మోదీ ప్రభుత్వం వేసిన రాజకీయ ఎత్తుగడ మాత్రమే. మోదీ ప్రభుత్వ పనితీరును ప్రతిపక్షంలోని అన్ని రాజకీయ పార్టీలు, నిరుద్యోగులు తీవ్రంగా దుయ్యబట్టారు. ఉద్యోగ పంపిణీ కోసం జాతీయ ఉపాధి పథకం వంటి పథకాలు నిర్వహించడం గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల జరిగిందని తన అసమర్థతను బయటపెట్టారు. అయితే భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలపై వేటువేసే ప్రమాదం ఉంది. 2013 లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోదీ మొదట ఏడాది కోటి ఉద్యోగాలు ఇస్తామని, ఆ తర్వాత 2014లో అందరికీ ఉద్యోగాలు ఇస్తామని, క్షేత్రస్థాయిలో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేశారు. మోదీ వాగ్దానాలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన ఎన్నడూ చేసిన ప్రయత్నంలేదు. రానున్న 18నెలల్లో 10లక్షల మందికి ఉద్యోగాల కల్పన ప్రాతిపదికగా ప్రధానిమోదీ "ఉద్యోగాలపంపిణీమేళా" ప్రారంభించారు. అయితే ప్రజలకు ఉద్యోగకల్పన విషయంలో తన వాగ్దానాన్ని నిలబెట్టు కోవడంలో మోదీ ఘోరంగా వైఫల్యం చెందారనేది సుస్పష్టం. వచ్చే 18 నెలల్లో 10 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించాలని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఈ ఏడాది జూన్‌లో మోదీ ఆదేశించారు. ప్రభుత్వ దుర్భరమైన పనితీరుకు నిదర్శనంగా ఈ మేళా ద్వారా కేవలం 75,000 ఉద్యోగాలను మాత్రమే ప్రభుత్వం కల్పించిన మోదీ వచ్చే 18 నెలల్లో 10 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారు.

అయితే "రోజ్‌గార్ మేళా" వెనుక ఉన్న అసలైన కారణాన్ని వివరిస్తూ ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేసేందుకు ఒకేసారి అపాయింట్‌మెంట్ లెటర్‌లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారు. నిరుద్యోగం పెంచడం ప్రభుత్వ వైఫల్యం కాదా? ప్రధాని మోదీ ప్రభుత్వ పథకాల గురించి కోట్లాది ఉద్యోగాల కల్పన గురించి ఊదరగొడుతూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామన్న మోదీ వాదనకు ఈ ప్రయత్నం విరుద్ధంగా ఉంది. వాస్తవాన్ని మరుగున పెట్టేందుకు తన పాలనలో దేశాన్ని 10 వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ నుండి 5 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు అభివృద్ధి చెందుతోందని చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రచారం ప్రభుత్వం చేపట్టింది. అయితే ఈ అభివృద్ధి కేవలం బడాబాబుల కోసం మాత్రమే. ఇది నిరుద్యోగంలో వృద్ధి మాత్రమే. మరో పక్క దేశంలో కార్మిక రంగం తీవ్ర అస్థిరతతో అనిశ్చితంగాఉంది. ప్రజలు ఒకనెలలో ఉద్యోగాలు పొందు తున్నారు. మరో నెలలో కోల్పోతున్నారు. ఉదాహరణకు, జూన్ నెలలో ప్రధాని మోదీ ప్రభుత్వంలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రకటించినప్పుడు, దేశంలో నిరుద్యోగిత 7.83 శాతంగా ఉంది. జూలై నటికి అది 6.83 శాతానికి పడిపోయింది. జాతీయ ఉద్యోగ విధానం రూపొందించకుండా నిర్వహించిన రోజ్‌గార్ మేళా(సంత) ప్రధాని విఫలయత్నంగా చెప్పవచ్చు.

ఆర్థిక సంక్షోభం దిశగా అగ్ర రాజ్యం!

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు!

దాచేస్తే దాగని సత్యం..అంటారు మహాకవి శ్రీశ్రీ. ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్, రష్యా దాడి పరిణామాలు గమనిస్తే అనేక అంశాలు ప్రజల దృష్టికి రాకుండా చేస్తున్న కుట్రలు స్పష్టమౌతాయి. ఉద్దేశపూర్వకం గానే అమెరికా సామ్రాజ్యవాదానికి మీడియా చేస్తున్న ప్రచారం అంతా ఇంతా కాదు. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా ప్రస్తుతం ఆర్థిక మాంద్యం దిశగా పయనిస్తోంది. బ్రిటన్ పౌండ్ రికార్డు స్థాయిలో పతనమైంది. దేశంలో ధరలు పెరిగిపోతున్నాయి. ఆహార ధరలు, గ్యాసు, పెట్రోలు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రజల ఆదాయాలు తగ్గిపోతున్నాయి. కార్పొరేట్ అనుకూలవిధానాలతో ప్రధాని లిజ్‌ట్రస్ 44 రోజులలోనే తన పదవికి రాజీనామా చేయవలసివచ్చింది. ఫ్రెంచ్ కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఆందోళనలో వున్నారు. ఇటలీ, ఆస్ట్రియా, హంగెరీ, యూరోపియన్ దేశాలన్నింటిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రజాందోళనలతో ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అక్టోబరు 5 న ఒపెక్ ప్లస్ దేశాలు రోజుకి 2 మిలియన్ బారళ్ల ముడిచమురు ఉత్పత్తిని తగ్గించాలని నిర్ణయించాయి. ఫలితంగా యూరప్, అమెరికాలలో కలకలం ప్రారంభమైంది.

నవంబరు 8 న జరిగే మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్లు విజయం సాధిస్తే ఉక్రెయిన్‌కు అమెరికా చేస్తున్న సహాయాన్ని నిలిపేస్తామని రిపబ్లికన్ పార్టీ నాయకుడు కెవిన్ మెక్ కార్తీ విలేకరుల సమావేశంలో చెప్పాడు. ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్-నాటో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ అమెరికా ఆయుధాలు, 16.8 బిలియన్ డాలర్ల నిధులు ఇవ్వడమేగాక, నిఘా పరికరాలతో పాటుగా సైనిక శిక్షణను అందిస్తున్నది. శాటిలైట్‌ల ద్వారా అత్యంత ఆధునిక నిఘా వ్యవస్థ ఉక్రెయిన్‌కు ప్రతి నిముషం రష్యా సైనికుల కదలికలను తెలుపుతుంది.

ఫ్రాన్స్, జర్మనీ ప్రజల తిరుగుబాటు

అమెరికా నిరంకుశ విధానాలతో యూరోపియన్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాయి. రష్యాతో వ్యాపార లావాదేవీలను నిలిపివేశారు. గ్యాస్ సరఫరా బందయింది. దీనితో అమెరికా లిక్విఫైయిడ్ గ్యాసు సరఫరాకు పూనుకుంది. లిక్విఫైయిడ్ గ్యాసును నాలుగు రెట్లు ధర ఎక్కువతో కొనుక్కోవడం ప్రశ్నార్థకంగా మారింది. జర్మన్ ప్రజలు గ్యాస్ కొనుగోలుకు భారీ మూల్యాన్ని చెల్లించవలసి వస్తోంది. ఎముకలు కొరుక్కుతినే చలిని తట్టుకోవటానికి వాతావరణాన్ని వేడిగా వుంచే హీటర్లు కావాలి. హీటర్లు పని చేయటానికి గ్యాసు కావాలి. ఇంధనం కొరతతో వివిధ దేశాల్లో పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉత్పత్తి లేకపోవడంతో కార్మికులు నిరుద్యోగులయ్యారు. నాటో విధానాల ఫలితంగా రష్యాపై విధించిన ఆంక్షల వలన ప్రజలు ఆకలితో అలమటించడమే కాకుండా, నిరుద్యోగులుగా మారుతున్నారు.

ఫ్రాన్స్‌లో నాటో వ్యతిరేక ప్రదర్శనలు

యూరప్ ప్రజల నాటో వ్యతిరేక ప్రదర్శనలు..

ఫ్రాన్స్‌లో ప్రజలు రోడ్డెక్కారు. సైన్యంతో వీధి పోరాటాలకు దిగారు. వేలాదిమంది భారీ ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. నాటో సైనిక కూటమి నుండి వైదొలగమని కార్మికులు, విద్యార్థులు దేశ వ్యాపిత సమ్మెకు దిగారు. పారిస్‌లో భారీ మార్చ్‌ను నిర్వహించారు. దేశవ్యాపితంగా 180 చోట్ల భారీ ప్రదర్శనలను నిర్వహించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయి. పరిశ్రమలు మూతపడుతున్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరుగు తోంది. ద్రవ్యోల్బణం 6.2 శాతానికి పైగా నమోదవుతోంది. యుద్ధం, ఇంధన కొరత, ధరల పెరుగుదలతో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తున్నాన్నారు. శ్రీలంకలో నిర్దిష్టమైన డిమాండ్స్, నాయకత్వం లోపంతో ఫలితాలు ఆశించినంతగా లేవు.

రష్యా భూభాగాన్ని రక్షించటానికి మాస్కో "తనకున్న అన్ని మార్గాలనూ" ఉపయోగిస్తుందని, తప్పనిసరి పరిస్థితులలో అణ్వాయుధాలు ఉపయోగించటానికి వెనకాడబోమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ హెచ్చరించినా తాజాగా ఆ పని చేయబోనని ప్రకటించారు. రెండవ ప్రపంచయుద్ధంలో అమెరికా హిరోషిమా, నాగసాకీలపై అణుబాంబుల దాడిని పుతిన్ గుర్తు చేశాడు. రష్యా, నాటోదేశాల మధ్య అస్తిత్వ యుద్ధంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని పుతిన్ అభివర్ణించారు. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ న్యూక్లియార్ వార్ హెడ్స్ రష్యా వద్ద 5977 వుండగా, అమెరికా వద్ద 5428 న్యూక్లియార్ వార్ హెడ్స్ వున్నాయి.

బైడెన్ జనవరి 2021న అధ్యక్షపదవి చేపట్టినప్పటి నుండీ రష్యా వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతం చేశాడు. రష్యా సరిహద్దుల్లో నాటో విస్తరణ చేపట్టాడు. నాటో సైనిక కూటమిలో సభ్యత్వాల ఆధారంగా యూరోపియన్ యూనియన్ దేశాలన్నిటినీ ఉక్రెయిన్‌కి సహాయంగా యుద్ధంలోకి లాగారు. సైనికంగా అమెరికాపై ఆధారపడిన నాటో దేశాలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ అమెరికా ఉచ్చులోపడి బయటకు రాలేక ప్రజల నుంచి తీవ్ర నిరసనలను ఎదుర్కొంటున్నాయి. అమెరికా యుద్ధోన్మాద కుట్రలవలన ప్రపంచదేశాలు ద్రవ్యోల్బణంలో చిక్కుకున్నాయి. రష్యా సరిహద్దుదేశాలను నాటో సైనిక కూటమిలో చేర్చుకునేప్రయత్నంలో అమెరికా సఫలమైంది. రష్యాకు అమెరికాను ఎదుర్కొనే సైనిక శక్తి, అణ్వాయుధాలు, సహజవనరులు పుష్కలంగా ఉన్నాయి. బలమైన ప్రత్యర్థిగా ఉన్న రష్యాను నాశనం చేయటమే ధ్యేయంగా అమెరికా నాటోను విస్తరించింది. అమెరికా యుద్ధోన్మాదంతో ప్రపంచాధిపత్యం కోసం ఉక్రెయిన్‌లో అంతర్యుధాన్ని ప్రోత్సహించి రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూల్చివేసింది.

ప్రజలే చరిత్ర నిర్మాతలు

అమెరికా ద్రవ్యోల్బణంతో ఆర్థిక మాంద్యం అంచుల్లో వుంది. నాటో నుండి వైదొలగమని యూరప్ ప్రజలు తిరగపడుతున్నారు. ప్రపంచ ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడింది. అణ్వాయుధ ప్రమాదం ముంచు కొస్తున్నది. అమెరికా కుట్రలను అర్థం చేసుకున్న యూరప్ యువత, కార్మికుల ప్రజాందోళనలు యుద్ధగతిని మార్చబోతున్నాయా! వేచి చూద్దాం. అంతిమంగా ప్రజలే చరిత్ర నిర్మాతలు.

-డాక్టర్ కొల్లా రాజమోహన్, 9000657799

సంక్షేమ పథకాలకు నీళ్లొదిలే కుట్ర!

సంక్షేమ పథకాల అమలు అనుకూల, వ్యతిరేక అభిప్రాయాలు, వాదనలు ఇటీవల ఎక్కువ జరుగుతున్నాయి. మోదీ, మోదీ ప్రభుత్వ మంత్రుల, సుప్రీమ్ కోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలే అందుకు కారణం. అనుకూల, వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న వారు ప్రభుత్వాలు అమలు జరిపే సంక్షేమ పథకాల్లో దాగి ఉన్న ఉద్దేశాలను కావాలనే మరుగుపరుస్తున్నారు. ప్రభుత్వాల నయవంచనను కప్పి పెడుతున్నారు. ప్రజలకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు దేని కోసం ప్రకటిస్తున్నాయి, సంక్షేమ పథకాల కోసం పేదలు ఎందుకు చూడవలసి వస్తున్నది, ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల కోసం కాకుండా స్వశక్తి పై పేదలు బతికటానికి కావాల్సింది ఏమిటి అన్న విషయాలను అర్థం చేసుకుంటేనే సంక్షేమ పథకాల్లో దాగి ఉన్న కుట్రను అర్థం చేసుకోగలము.

దేశానికి 'స్వాతంత్ర్యం' వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ కాలంలో పేదల జీవితాల్లో మౌలిక మార్పులు సంభవించాయా అంటే వచ్చే సమాధానం లేదనే వస్తుంది. పేదల పరిస్థితులు, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా అంటే కూడా లేదనే సమాధానం వస్తుంది. ఇందుకు ప్రభుత్వాలు కారణమా అంటే అవును అని వెంటనే సమాధానం వస్తుంది. పేదల జీవన పరిస్థితులు మెరుగు పడటం అనేది పాలించే పాలక పార్టీల, ప్రభుత్వాల వర్గ స్వభావం ముఖ్యమైన అంశంగా ఉంటుంది. భారత పాలక పార్టీల, ప్రభుత్వాల వర్గ స్వభావం దోపిడీ వర్గాలను కాపాడే స్వభావం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలన్నీ బడా పెట్టుబడి దారుల, భూస్వాముల, సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాలకు ప్రాతినిధ్య వహిస్తూ ప్రజా వ్యతిరేక, పేదల వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నవే. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారాన్ని పక్కన పెడుతున్నాయి.

భారతదేశం నేటికీ వ్యవసాయక దేశమని పాలక పార్టీలతో సహా అందరూ అంగీకరిస్తున్నారు. ఇప్పటికీ 68% ప్రజలు గ్రామీణ ప్రాంతంలోనే ఉన్నారు. గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు సేద్యానికి కావాల్సిన భూమి, పని చేయటానికి ఉపాధి. 'స్వాతంత్ర్య పాలనలో గ్రామీణ పేదలకు ఈ రెండు లభించలేదు. పట్టణ పేదలకు, శ్రామికులకు ఉపాధి దొరకక, ఉన్న ఉపాధి పనులు తరిగి పోతున్నాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ పేదలు దుర్భరమైన పేదరికంలో మగ్గుతున్నారు. పేదరికానికి, దుర్భర జీవితాలకు తాము సేద్యం చేసి పంటలు పండించే భూమిపై హక్కు లేక పోవటమని గ్రహించిన గ్రామీణ పేదలు భూమిపై హక్కు కోసం పోరాటం ప్రారంభించారు. అలా వచ్చిన పోరాటాలే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్‌బరీ, శ్రీకాకుళం రైతాంగ గిరిజన పోరాటాలు. ఇవి గాక దేశంలో అనేక ప్రాంతాల్లో పేదల భూ పోరాటాలు జరిగాయి. హక్కుల కోసం, ఉపాధి కల్పన కోసం, నిరుద్యోగ నివారణ కోసం, ధరల అదుపు కోసం శ్రామికులు, పట్టణ పేదల మిలిటెంట్ ఆందోళనలు చేశారు.

గ్రామీణ పేదల, పట్టణ పేదల, శ్రామికుల పోరాటాలు పాలక వర్గాల వెన్నులో వణుకు పుట్టించాయి. పోరాటాలపై తీవ్ర అణచివేతను అమలు జరుపుతూనే కొన్ని, చట్టాలు, సంక్షేమ పథకాలు పాలక ప్రభుత్వాలు ప్రవేశపెట్టక తప్పలేదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో ప్రారంభమైన పథకాలు నేడు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. సంక్షేమ పథకాల పేరు చెప్పకుండా పాలక పార్టీలు మనుగడ సాగించలేక పోతున్నాయి. ఇందిరాగాంధి చేసిన భూ సంస్కరణల చట్టం, బ్యాంకుల జాతీయకరణ, పేదలకు బ్యాంకుల రుణాలు, గొర్రెల, బర్రెల వంటి పథకాలు, నేడు అనేక రాష్ట్రాలు మితిమీరిన సంక్షేమ పథకాల అమలులో పోటీ పడటం ప్రజల వ్యతిరేకత నుండి జరుగుతున్నదే.

సంక్షేమ పథకాల అమలు చేయటంలో ప్రభుత్వాలకు ఖచ్చితమైన ఎత్తుగడ ఉంది. సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమకు అనుకూలంగా పైరవీ కారులను తయారు చేయటం, ప్రజలను ఉద్యమ బాట నుంచి తప్పించి, ఆర్థిక ప్రయోజనాల కోసం తమ చుట్టూ తిరిగేలా చేయటం వీటి ద్వారా ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేయటం. తద్వారా అధికారాన్ని నిలబెట్టుకోవటమే పాలకుల లక్ష్యం.

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు ప్రజా ఉద్యమాలకు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. అనేక పథకాలను జగన్మోహనరెడ్డి పెట్టి ప్రజలు వాటి కోసం ఎదురు చూసేలా ప్రజల మనస్సును మళ్లించాడు. ప్రజా సంఘాల్లో, ఉద్యమాల్లో ప్రజలు సంఘటిత పడకుండా, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వెట్టి చాకిరీ చేసేలా వాలంటీర్లను నియమించి వారి ద్వారా సచివాలయం, రైతుభరోసా కేంద్రాల్లో తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రజలకు చెప్పటం ద్వారా, ప్రజా సంఘాల ద్వారా ఉద్యమాలు చేయవద్దని పరోక్షంగా ప్రజలకు హెచ్చరిక పంపాడు. ఈ విధంగా వైసీపీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలకు అత్యంత ప్రమాదికారిగా ఉంది.

నరేంద్రమోదీ ప్రభుత్వం పిఎం అవాజ్ యోజన, ఉచిత బియ్యం పథకం, ఉచిత వైద్య సేవలు, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి లాంటి సంక్షేమ పథకాలు అమలు జరుపుతూనే, రాష్ట్రాలు మాత్రం సంక్షేమ పథకాలు అమలు జరపరాదంటున్నది. 23-10-22 న పీఎం అవాజ్ యోజన పథకం లబ్దిదారుల నుద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఉచిత పథకాలు ప్రకటించటంపై విమర్శలు గుప్పించాడు. పన్నులు చెల్లించేవారు తాము చెల్లించే పన్నులను ఉచిత పథకాలకు ఖర్చుపెట్టంపై వారు ఎంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం పన్నుల సొమ్మును ప్రజల సంక్షేమానికి ఖర్చు పెట్టటంపై వారు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. పన్నులు కట్టేది బడా పెట్టుబడిదారులు, సంపన్న వర్గాలే కాదు, వారికన్నా సామాన్య ప్రజలు, పేదలు వివిధ రూపాల్లో ఎక్కువగా పన్నులు చెల్లిస్తున్నారు. ఇది మోదీకి తెలియదా! ప్రజల సొమ్ము వారికి కాకుండా పారిశ్రామిక వేత్తలకు మాత్రమే కట్టి పెడతానని మోదీ చెప్పకనే చెబుతున్నాడు. అందులో భాగమే ఈ సంవత్సరం మూడు లక్షల కోట్ల దాకా బడా పారిశ్రామికవేత్తల బ్యాంకుల అప్పులను మొండి బకాయల పేరుతో రద్దు చేయటం.

సంక్షేమపథకాల అమలుగురించి మాట్లాడేవారు పేదల మౌలిక సమస్యల పరిష్కారం గురించి ఏమి చెబుతారు. వారు ఎల్లకాలం పాలక ప్రభుత్వాల సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తూ, యాచకులుగా బతకాల్సిందేనా! మౌలిక సమస్యలు పరిష్కరించుకొని ఉన్న భూమిని, ఉపాధిని సాధించుకుని ఎవరి దయ మీద ఆధార పడకుండా స్వతంత్రంగా బతకమని చెప్పరా! సంక్షేమపథకాలు వద్దనే వారు పేదలకు కాకుండా ప్రజల సొమ్మును బడా పారిశ్రామికవేత్తలకు మాత్రమే కట్టబెట్టాలని కోరుకుంటున్నారా! గ్రామీణ, పట్టణ పేదలు పాలక వర్గాల సంక్షేమ పథకాల ఉద్దేశాలను అర్థం చేసుకుని, వాటిని ఉపయోగించుకుంటూనే, వారి మౌలిక సమస్యలైన సేద్యపు భూమిని, ఉపాధిని సాధించుకున్నప్పుడే ఎవరి మీదా ఆధారపడకుండా స్వయం శక్తితో జీవించగలమని తెలుసుకుని వాటిని సాధించుకునేందుకు ఉద్యమించాలి.

బొల్లిముంత సాంబశివరావు

నిర్లక్ష్యమే ప్రాణాలు తీసింది

ఇ-మెయిల్

గుజరాత్‌లోని మోర్బీ పట్టణంలో ఓ నదిపై ఉన్న పురాతన రోప్ బ్రిడ్జి కూలిన ఘటనలో 141 మంది ప్రాణాలు కోల్పోవడం, వందమందికి పైగా గాయాల పాలవ్వడం తీవ్ర విషాదకర ఉదంతం. మనసును కలచివేసిన దుర్ఘటన. ఈ దుర్ఘటనకు మూల కారణం ఏదైనప్పటికీ మానవ నిర్లక్ష్యం మాత్రం పెద్ద పాత్ర వహించింది. ఇది నివారింపదగిన పెను విషాదం. దాదాపు నూటఏభై ఏళ్ల వయసున్న ఈ బ్రిడ్జి ఓ పర్యాటక ఆకర్షణ. ఆరు నెలలుగా మరమ్మత్తుల కోసం మూసివేశారని, నాలుగు రోజుల క్రితమే తెరిచారని వార్త. అది కూడా అధికారుల నుండి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే తెరిచారట. ఎంత బరితెగింపు! పర్యాటక ప్రాంతంలో దీపావళి పండుగ సందర్భంగా పెరిగే పర్యాటకుల తాకిడి, లాభాలు దృష్టిలో ఉంచుకున్నారు తప్పితే ప్రాణాలకు వచ్చే ప్రమాదాన్ని లెక్కలోకి తీసుకోలేదు. బ్రిడ్జి పై అనుమతించినా కెపాసిటీని మించి యాత్రికులు రాకుండా చూడాల్సింది.100 మంది పరిమితి అయితే 500 మంది దాకా ఆ సమయంలో బ్రిడ్జి పై ఉన్నట్టు వార్త. సంబంధిత అధికారులు ఏం చేస్తున్నట్టు? అంతటి పురాతన వంతెన- అదీ వేలాడే వంతెన- మరమ్మత్తులకు వచ్చిందంటే ఎంతవరకూ బాగయిందో చూడవద్దా? ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి రిస్క్ అంచనా వెయ్యడం, దానికి తగినట్టు గుంపుని పరిమితం చెయ్యడం చెయ్యాలి కదా! నిర్వహణ తలకెత్తుకున్న ప్రయివేట్ కంపెనీ, ప్రారంభించినప్పుడు ఫిట్‌నెస్ ఉందోలేదో చూడాల్సిన అధికార గణం అందరూ ఈ దుర్ఘటనకు బాధ్యులే. ముద్దాయిలే. జాతీయ విపత్తు దళాలు చురుకుగా సమర్థవంతంగా పనిచేసి నష్టాన్ని తగ్గిస్తున్నాయి. అదే తీరులో నష్టం జరగకుండా నివారణ దశలోనే పని చేసే వ్యవస్థ అవసరం. ప్రమాదం పొంచి ఉన్న సందర్భాలను గుర్తించి, అవి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలి. ఎలాంటి ఉదాసీనతకూ అవకాశం లేకుండా పక్కాగా అనుమతులు, గుంపు నియంత్రణ చర్యలు లాంటివి చూసుకోవాలి. ప్రాణాలకు విలువనిచ్చే సమాజంగా మారే వరకూ ఇలాంటి దుర్ఘటనల్ని ఆపలేం.

- డా. డి.వి.జి.శంకరరావు, 9440836931

మానవ తప్పిదమేనా?

తీగల వంతెన ప్రమాదంపై అన్నీ అనుమానాలే

మోర్బీ: గుజరాత్‌లోని మోర్బీ నగరంలో మచ్చు నదిపై తీగల వంతెన కూలిన దుర్ఘటనకు మానవ తప్పిదాలే ప్రధాన కారణాలుగా కన్పిస్తున్నాయి. కేవలం 100 మందిని మాత్రమే మోయగల సామర్థ్యం ఉన్న వంతెనపైకి 400-500 మందిని అనుమతించడం.. కొందరు ఆకతాయి చేష్టలు చేయడం వల్లే వంతెన కూలినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. అందులో సందర్శకులు వంతెనపై నిల్చుని ఉండగా.. కొందరు బ్రిడ్జిని ఊపుతూ కన్పించారు. ఆ వెంటనే వంతెన కుప్పకూలి అందరూ నదిలో పడిపోయారు.

వద్దని చెప్పినా వంతెనను ఊపుతూనే..

అహ్మదాబాద్‌కు చెందిన విజయ్ గోస్వామి కుటుంబం ఈ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ప్రమాదం రోజు మధ్యాహ్నం గోస్వామి తన కుటుంబసభ్యులతో కలిసి తీగల వంతెనను చూసేందుకు వెళ్లారు. 'వంతెనపై సగం దూరం వెళ్లేసరికి విపరీతమైన రద్దీ కన్పించింది.

దీంతో పాటు కొందరు యువకులు ఉద్దేశపూర్వకంగా వంతెనను ఊపుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడ్డారు. వద్దని వారించినా వినిపించుకోలేదు. దీంతో ప్రమాదమని భావించి మేమంతా సగం నుంచి వెనక్కి వచ్చేశాం. ఈ విషయం గురించి బ్రిడ్జి నిర్వాహకులను అప్రమత్తం చేశాం. కానీ వారు పట్టించుకోలేదు. సాయంత్రానికే ఈ ఘోరం గురించి వినాల్సి వచ్చింది' అని గోస్వామి తెలిపారు.

అనుభవం లేని కంపెనీకి మరమ్మతు బాధ్యతలు

మోర్బీ తీగల వంతెన ఘటనపై అనేక సందేహాలు నెలకొన్నాయి. మరమ్మతుల అనంతరం ఏడు నెలల తర్వాత అందుబాటులోకి వచ్చిన కొద్దిరోజులకే కూలడం కలకలం రేపింది. ఈ క్రమంలో మరమ్మతు బాధ్యతలు చేపట్టిన కంపెనీపై దృష్టి సారించారు. గుజరాత్‌కే చెందిన ఒరెవా గ్రూప్ ఈ బాధ్యతలు చేపట్టింది. సీఎఫ్‌ఎల్ బల్బులు, గోడ గడియారాలు, ఈ-బైక్‌లు తయారు చేసే కంపెనీగా పేరొందిన ఈ గ్రూప్‌నకు.. నిర్మాణ రంగంలో అసలు అనుభవమే లేకపోవడం గమనార్హం. అలాంటి కంపెనీకి వందేళ్ల పురాతన బ్రిడ్జి మరమ్మతు, నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్ ఎలా దక్కిందన్నదానిపై ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. గుజరాత్‌కు చెందిన ఒదావాజీ రాఘవ్‌జీ పటేల్ దాదాపు 50 ఏళ్ల క్రితం ఈ కంపెనీని నెలకొల్పారు. నెల క్రితమే ఆయన మరణించారు. అజంతా, ఆర్పాట్ బ్రాండ్లపై గోడ గడియారాలు తయారు చేసే కంపెనీగా అందరికీ ఈ కంపెనీ సుపరిచితమే. తొలినాళ్లలో అజంతా గోడ గడియారాలు మాత్రమే తయారు చేసే ఈ సంస్థ.. తర్వాత వివిధ వ్యాపార విభాగాల్లో అడుగుపెట్టింది. గృహ, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు విద్యుత్ దీపాలు, కాలుక్యులేటర్లు, ఈ-బైక్స్‌ను తయారు చేస్తోంది. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ రూ.800 కోట్లుగా ఉంది.

15 ఏళ్ల కాంట్రాక్ట్

2022 మార్చిలో బ్రిడ్జి మరమ్మతులకు సంబంధించి ఒరెవా కంపెనీ ఈ కాంట్రాక్ట్ దక్కించుకుంది. 15 ఏళ్లు దీని గడువు. ఈ కాలంలో నిర్వహణ, బ్రిడ్జిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బ్రిడ్జిపైకి వెళ్లేందుకు టికెట్ వసూలు చేసుకునేందుకూ కాంట్రాక్టులో వీలు కల్పించారు. పైగా ఏటా టికెట్ ధరలను పెంచుకునేందుకూ అనుమతించారు. తాజా దుర్ఘటన నేపథ్యంలో కంపెనీ యాజ మాన్యం స్పందించలేదు. అయితే, పరిమితికి మించి ప్రజలు బ్రిడ్జిపైకి వెళ్లడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొనడం గమనార్హం.

బీజేపీ ఎంపీ కుటుంబ సభ్యులు 12 మంది మృతి

మోర్బీ: గుజరాత్‌లోని మోర్బీ నగరంలో తీగల వంతెన కూలిన దుర్ఘటన ఓ బీజేపీ ఎంపీ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏకంగా 12మంది కుటుంబ సభ్యులు మృతి చెందారు. రాజ్‌కోట్ ఎంపీ మోహన్‌భాయ్ కల్యాణ్‌జీ కుందారియా సోదరి కుటుంబసభ్యులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. దీని గురించి కుందారియా మాట్లాడుతూ 'తీగల వంతెన కూలిన ప్రమాదంలో నేను 12 మంది కుటుంబసభ్యులను కోల్పోయాను. అందులో చిన్నారులు కూడా ఉన్నారు. వారంతా నా సోదరి కుటుంబానికి చెందినవారు" అని ఉద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వంతెన అనుమతుల గురించి వస్తోన్న వార్తలపైనా ఎంపీ స్పందించారు. 'ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. బాధ్యులను శిక్షిస్తాం. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలే ఉన్నారు' అని విచారం వ్యక్తం చేశారు. మోర్బీ నగరంలో మచ్చు నదిపై ఉన్న బ్రిటిష్ పాలన కాలం నాటి ఓ తీగల వంతెన ఆదివారం కూలిన విషయం తెలిసిందే. దీపావళి సెలవులకు తోడు ఆదివారం కూడా కావడంతో ఈ వంతెన వద్ద పర్యాటకుల రద్దీ బాగా కనిపించింది. సందర్శకుల సంఖ్య మరీ ఎక్కువ కావడంతో.. అధిక బరువును మోయలేక వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. అయితే కొన్నేళ్ల పాటు నిరుపయోగంగా ఉన్న ఈ వంతెనకు దాదాపు 7 నెలల పాటు మరమ్మతులు చేసి ఈనెల 26నే తిరిగి తెరిచారు. ఈలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

కానరాని బ్రిడ్జ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్

ఈ తీగల వంతెన ఏడు నెలల క్రితమే మూతపడింది. మరమ్మతుల అనంతరం అక్టోబర్ 26న తిరిగి ప్రారంభమైంది. ఈ మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను మోర్బీ మున్సిపాలిటీ అధికారులు ఒరెవా గ్రూప్‌నకు కట్టబెట్టారు. అయితే, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే ఈ బ్రిడ్జిని సందర్శకులకు అనుమతించారని తెలుస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన ఈ కంపెనీలో సుమారు 6 వేల మంది పనిచేస్తున్నారు. గోడ గడియారాలు, ఈ-బైక్స్, సీఎఫ్‌ఎల్ బల్బుల తయారీలో అనుభవం ఉందని కంపెనీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. కానీ, కంపెనీ ప్రొఫైల్ హిస్టరీలో నిర్మాణ రంగం ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

పాత భవనంలోనే పార్లమెంటు శీతాకాల సమావేశాలు!

న్యూఢిల్లీ: నిర్ణీత సమయానికి మించి కొత్త భవన నిర్మాణ (సెంట్రల్ విస్టా) పనులు కొనసాగే అవకాశం ఉన్నందున పార్లమెంటు శీతాకాల సమావేశాలను పాత భవనంలోనే నిర్వహించవచ్చని సోమవారం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సాధారణంగా నవంబర్ మూడో వారం నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతాయి. అంతకు ముందే కొత్త పార్లమెంట్ భవనాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భవనం సివిల్ పనులు దాదాపు పూర్తయ్యాయని, విద్యుత్ సంబంధి త పనులు సహా ఇతరత్రా పనులు ఈ ఏడాది చివరి వరకు కొనసాగే అవకాశం ఉందని వారు తెలిపారు. నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు భవనాల నిర్మాణంతో పాటు వివిధ ప్రదేశాల్లో గృహోపకరణాలు, తివాచీలు, కుడ్య చిత్రాలు , ఇతర వస్తువులను తయారు చేయడం వంటి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనులు నిరంతరాయంగా జరుగుతున్నప్పటికీ ప్రస్తుత దశలో కచ్చితంగా పనులు పూర్తి చేసే తేదీని పేర్కొనడం కష్టమని వారు వెల్లడించారు. అందువల్ల పాత భవనంలోనే శీతాకాల సమావేశాల జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేరని సంబంధిత వర్గాలు తెలిపాయి.

బీజేపీకి ఘోర పరాజయం తప్పదు: తేజస్వి

పాట్నా: మొకామా, గోపాల్‌గంజ్ అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం తప్పదని ఆర్జేడీ నాయకుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ యాదవ్ ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినా అభ్యర్థులకు ఆయన ఆశీస్సులుంటా యని మొకామా, గోపాల్‌గంజ్ అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో ఆర్జేడీకి జేడీ(యూ) నుంచి అవసరమైన సహాయం అందుతోందని యాదవ్ తెలిపారు. గాయం కారణంగా ముఖ్యమంత్రి నితీశ్... ప్రచారానికి దూరంగా ఉన్నారని స్పష్టం చేశారు. 'నితీశ్ కుమార్ జీ మహాఘటబంధన్ నాయకుడు... సంకీర్ణ కూటమి తరపున ఆర్జేడీ అభ్యర్థులిద్దరూ పోటీలో ఉన్నారు. ఆయన భౌతికంగా వారి వెంట ఉండకపోవచ్చు కానీ ఆయన ఆశీర్వాదాలు వారికి చేరుతూనే ఉంటాయి' అని యాదవ్ అన్నారు. మహాకూటమిలో ఇమడలేకపోవడం వల్లే నితీశ్ ప్రచారానికి దూరంగా ఉన్న బీజేపీ వాదనను ఆయన తోసిపుచ్చారు. బీజేపీ కంగారుగా ఉందని, రెండు స్థానాల్లో ఎటువంటి అవకాశం లేదని ఆపార్టీకి తెలుసునని యాదవ్ చెప్పారు. ఓటమిని ముందే ఊహించారు కాబట్టే రాష్ట్రం నలుమూలల నుంచి, బయటి నుంచి కూడా ఆ పార్టీ నేతలు రెండు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. పదిహేను రోజుల క్రితం స్టీమర్‌ను నడుపుతూ... గంగా నదిపై ఉన్న వంతెన స్తంభాన్ని ఢీకొట్టడంతో ముఖ్యమంత్రికి గాయాలయ్యాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో మంగళవారంతో ప్రచారం గడువు ముగియనుండగా, గురువారం పోలింగ్ జరగనుంది.

శరద్ పవార్‌కు అస్వస్థత... ఆస్పత్రికి తరలింపు

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ అస్వస్థత కారణంగా ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరినట్టు పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. 81 ఏళ్ల పవార్ మరో మూడు రోజులు ఆసుపత్రిలోనే ఉండనున్నారు. పార్టీ ఆఫీసు బ్యారర్లు, కార్యకర్తలు ఎవరూ ఆసుపత్రి వద్ద గుమిగూడవద్దని ఎన్‌సీపీ ప్రధాన కార్యదర్శి శివాజీరావు గార్జె పార్టీ అధికారిక లేఖలో కోరారు. షెడ్యూల్ ప్రకారం రాహుల్ గాంధీ సారథ్యంలో కొనసాగుతున్న భారత్ జోడో యాత్రలో నవంబర్ 8న పవార్ పాల్గొనాల్సి ఉంది. నాందేడ్ గుండా మహారాష్ట్రలోకి ఈనెల 7న భారత్ జోడో యాత్ర అడుగుపెడుతోంది. భారత్ జోడో దేశవ్యాప్త యాత్రలో పాల్గొనాల్సిందిగా పార్టీ ఆహ్వానానికి పవార్ సమ్మతి తెలిపినట్టు మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే ఇంతకుముందు ప్రకటించారు. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) చీఫ్ ఉద్ధవ్ థాకరేను కూడా ఆహ్వానించామని, ఆయన నుంచి ఇంకా సమాధానం రాలేదని చెప్పారు. 150 రోజుల భారత్ జోడో యాత్రలో భాగంగా బుల్దానాలోని నాందేడ్, షేగావ్‌లలో ర్యాలీలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించనున్నారు. నిజాం పాలన నుంచి మరాట్వాడాకు విముక్తి లభించి 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో భారత్ జోడో యాత్ర మహారాష్ట్రలో అడుగుపెడుతుండటం విశేషమని, ఈ సందర్భాన్ని రాహుల్‌తో కలిసి నాందేడ్‌లో సెలబ్రేట్ చేసుకుంటామని పటోలే తెలిపారు.

ఉరి ఘట్టం రిహార్సల్స్... 12 ఏళ్ల బాలుడి మృతి

చిత్రదుర్గ: కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఉరి సన్నివేశం రిహార్సల్స్ చేస్తూ 12 ఏళ్ల బాలుడు సంజయ్ గౌడ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్ఎల్‌వీ పాఠశాలలో సంజయ్ గౌడ ఏడో తరగతి చదువుతున్నాడు. నవంబర్ 1న కర్ణాటక రాజ్యోత్సవ వేడుకల సందర్భంగా కళాశాలలో భగత్ సింగ్ నాటకం వేయాల్సి ఉంది. ఇందులో భగత్ సింగ్ పాత్ర అతనికి అప్పగించారు. ఇందుకోసం ఇంట్లో రిహార్సల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ అతను మరణించాడు. ఇంట్లో పెద్ద వాళ్లంతా పనుల కోసం బయటకు వెళ్లిన సమయంలో ఈ విషాదం చోటుచేసు కుంది. 'నాటకం రిహార్సల్స్ కోసం రూములో ఒక తాడును ఫ్యానుకు కట్టినట్టు కనిపిస్తోంది. ఉలెన్ క్యాప్‌ను తలకు పెట్టుకుని మెడ చుట్టూ ఉచ్చు వేసుకున్నాడు. మంచం మీద నుంచి కిందకు దూకడంతో నిమిషాల్లోనే ప్రాణాలు అనంతవాయు వుల్లో కలిసిపోయినట్టు కనిపిస్తోంది' అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు విగత జీవుడుగా తమ పిల్లవాడు కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బాలుడు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, భగత్ సింగ్ నాటకం కోసం అదేరోజు పాఠశాలలో కూడా పిల్లలు రిహార్సల్స్ వేశారని, అయితే స్టూల్ ఉపయోగించలేదని అదే స్కూలులో తన కుమారుడిని కూడా చదివిస్తున్న సుందర్ రాజ్ తెలిపాడు.

ఇందిరాగాంధీ, పటేల్‌కు

రాహుల్ నివాళి

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఇద్దరు అగ్రనేతలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'నేను మీ ప్రేమ, బోధనలను నా హృదయంలో ఉంచుతాను. భారతదేశానికి మీరు చేసిన త్యాగాలను వృథా చేయనివ్వను' అని తన నాయినమ్మ కూడా అయిన ఇందిరాగాంధీకి రాహుల్ నివాళులర్పించారు. ఇందిర ప్రసంగాలు, ఆమె అంత్యక్రియల క్లిప్పింగ్స్‌తో కూడిన ఒక వీడియోను కూడా ఆయన తన ట్వీట్‌కు జత చేశారు. 'సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు కవచం భారతదేశాన్ని ఏకం చేస్తుంది. ఆయన వెలిగించిన ఐక్యతా జ్వాల మునుపెన్నడూ లేనంతగా ప్రకాశించేలా చేయడమే ఆయనకు అత్యంత సముచిత నివాళి' అని మరొక ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో భారత్ జోడో యాత్రలో నిమగ్నమైన రాహుల్ గాంధీ... ఇందిరా గాంధీ, పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గవర్నర్ తప్పుకోవాల్సిందే

డీఎంకే మిత్రపక్షాల డిమాండ్

చెన్నై: రాజ్యాంగ ధర్మాసనానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై బహిరంగ సభల్లో విమర్శలు చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి పదవి నుంచి తప్పుకోవాలని డీఎంకే మిత్రపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఓ సంయుక్త ప్రకటన మీడియాకు విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ పాలకుల మెప్పు పొంది గవర్నర్ హోదా కంటే మరింత ఉన్నతమైన పదవిని ఆశిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి బాధ్యతలు విస్మరిస్తున్నారని విరుచుకుపడ్డారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ద్రవిడకళగం నేత కే వీరమణి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత కాదర్ మొయిద్దీన్, డీపీఐ నేత తిరుమావళవన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా, తమిళగ వాళ్వురిమై కట్చి నాయకుడు వేల్ మురుగన్, కొంగునాట్టు మక్కల్ దేశీయ కట్చి ప్రధాన కార్యదర్శి ఈశ్వరన్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేయడమే ముఖ్యమని భావిస్తే ఆర్ఎన్ రవి గవర్నర్ పదవి నుంచి తప్పుకుని విమర్శించవచ్చని సలహా ఇచ్చారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ ప్రతిష్ఠను కించపరిచేలా ప్రవర్తించటం, విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని డీఎంకే మిత్రపక్షాల నాయకులు ఆరోపించారు. ఇటీవల ఆయన సనాతన, ఆర్య, ద్రావిడ, షెడ్యూలు వర్గాలవారి గురించి, తిరుక్కురళ్ కోసం వెల్లడించిన అభిప్రాయాలన్నీ ప్రజలమధ్య చిచ్చురగిల్చేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.. గవర్నర్ ఆర్ఎన్ రవి ఆధ్యాత్మిక భావాలు కలిగినవారైనా ద్రావిడ తరహా డీఎంకే పాలనను విమర్శించడం గర్హనీయమన్నారు. ఇటీ వల భారత్ సెక్యులర్ దేశమని చెబుతున్నారని, అయితే ఏ దేశమైనా సరే మతం ప్రాతిపదికగానే మనుగడసాగిస్తుం దని, ఈ విషయంలో భారత్ మినహాయింపు కాదని, మతప్రాతిపదిక పరమైన దేశమేననే భావంతో మాట్లాడటం రాజ్యాంగానికి విరుద్ధమని తెలిపారు. ఆ మాటలను బట్టి గవర్నర్‌కు ప్రపంచ చరిత్ర, రాజ్యాంగ ధర్మాసనం గురించి ఏవీ తెలియడం లేదని రుజువవుతోందన్నారు. ఐక్యరాజ్య సమితి గుర్తింపు కలిగిన 195 దేశాల్లో 30 దేశాలు మాత్రమే మతప్రాతిపదికపరమైనవని ఆ నాయకులు గుర్తు చేశారు. ఏది ఏమైనప్పటికీ కేంద్రంలోని బీజేపీ పాలకులకు మద్దతుగా ప్రవర్తిస్తూ డీఎంకే ప్రభుత్వ పాలన కించపరిచేలా వ్యాఖ్యలు చేయడమే గవర్నర్ పనిగా పెట్టుకున్నట్లు ఇటీవల ప్రకటనలు రుజువు చేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. రాజ్యాంగ ధర్మాసనానికి విరు ద్ధంగా ప్రవర్తిస్తున్న గవర్నర్ పదవి నుంచి తప్పుకోవడమే మంచిదని డీఎంకే మిత్ర పక్షాల నాయకులు హితవు పలికారు.

భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఏఎఫ్‌ఎస్‌పీఏ తొలగింపు

అసోం సీఎం హిమంత బిశ్వాశర్మ

గుహవతి: రాష్ట్రంలోని మరో రెండు ప్రాంతాల నుంచి ఏఎఫ్‌ఎస్‌పీఏ ఉపసంహరించే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ సోమవారం తెలిపారు. కల్లోలిత ప్రాంతంగా పేర్కొంటూ బరాక్ లోయలోని కాచర్ పరిధిలోని లఖిపూర్ సబ్-డివిజన్‌తో పాటు టిన్సుకియా, దిబ్రూఘర్, చరైడియో, శివసాగర్, జోర్హాట్, గోలాఘాట్, కర్బీ అంగ్లాంగ్, డిమా హసావో జిల్లాలకు అక్టో బర్ 1 నుంచి మరో ఆరు నెలల పాటు సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం, 1958 (ఏఎఫ్‌ఎస్‌పీఏ) అమలును పొడిగించారు. పశ్చిమ కర్బీ అంగ్లాంగ్ జిల్లాలో పరిస్థితి గణనీయంగా మెరుగుపడటంతో ప్రభుత్వం వివాదాస్పద చట్టాన్ని ఉపసంహరించుకుంది. లొంగిపోయిన మిలిటెంట్లకు పునరావాసం కోసం ఇక్కడ జరిగిన ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి బిశ్వాశర్మ మాట్లాడుతూ... 'అసోం, ఈశాన్య రాష్ట్రాలలో తిరిగి శాంతి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 65 శాతం ప్రాంతాల్లో ఏఎఫ్ ఎస్‌పీఏ తొలగించబడింది. భవిష్యత్తులో, కాచర్‌లోని లఖీపూర్, మొత్తం కర్బీ ఆంగ్లాంగ్ జిల్లా నుండి దీనిని ఉపసంహరించుకునే అంశాన్ని మేము పరిశీలిస్తున్నాము' అని తెలిపారు. ఏఎఫ్‌ఎస్‌పీఏ పరిధి నుంచి మరో రెండు ప్రాంతాలను ఉపసంహరించుకున్నాక ఎగువ అసోంలోని ఆరు జిల్లాలు మాత్రమే ఈ చట్టం పరిధిలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. త్రిపుర, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్‌లోని వివిధ ప్రాంతాలకు కూడా ఏఎఫ్‌ఎస్‌పీఏ కింద 'కల్లోలిత ప్రాంతం' ముద్రను తొలగించినట్లు తెలిపారు. భద్రతా బలగాలు ఎవరినైనా కాల్చి చంపినట్లయితే... ఈ విషయంలో వారికి అరెస్టు, ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు ఎటువంటి ముందస్తు వారెంట్ లేకుండా ఆపరేషన్లు నిర్వహించడానికి, ఎవరినైనా అరెస్టు చేయడానికి సాయుధ సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం, 1958... భద్రతా దళాలకు అధికారం కల్పిస్తుంది.

ప్రభుత్వోద్యోగుల మద్దతు దక్కేనా?

- వారిపైనే కాంగ్రెస్... ఆప్ ఆశలు
- ఓపీఎస్ పునరుద్ధరణ... పారదర్శక నియామకాలకు భరోసా
- అధికార బీజేపీని ఇరకాటంలో పెట్టేందుకేనా?
- హిమాచల్ ఎన్నికల్లో వాగ్దానాల హోరు

చండీగఢ్: హిమాచల్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం మరింత రసవత్తరంగా సాగుతోంది. కాషాయ పార్టీ బీజేపీని అధికార పీఠం నుంచి దించేందుకు ప్రతిపక్ష పార్టీలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. నవంబర్ 12న అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార బీజేపీని ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వోద్యోగుల మద్దతును కోరుతున్నాయి. రెండు ప్రతిపక్ష పార్టీలు పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరణ, పారదర్శకమైన నియామకానికి భరోసా, ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను పరిష్కరిస్తామని సహా అనేక వాగ్దానాలు చేస్తున్నాయి. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడంతో ప్రస్తుత పాలకులు బకాయిలను చెల్లించలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రతిపక్ష నేత ముఖేష్ అగ్నిహోత్రి ఇటీవల మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాల పై విచారణకు ఆదేశిస్తానని అన్నారు. ప్రస్తుత పాలనలో గత కొన్నేళ్లుగా భర్తీ చేసిన పోస్టుల్లో పెద్ద తేడాలున్నాయని ఆరోపించారు. మరోవైపు, రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులను తప్పుదోవ పట్టించడమేనంటూ ప్రతిపక్షం పై అధికార బీజేపీ దాడి చేసింది. తమ పార్టీ ప్రభుత్వం ఉద్యోగులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ కశ్యప్ ఇటీవల మీడియా ప్రకటనలో తెలిపారు.

పాత... కొత్త పెన్షన్ పథకాలు

2004 తర్వాత హిమాచల్ ప్రదేశ్‌లో రిక్రూట్ అయిన వారు కొత్త పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) పరిధిలోకి వస్తారు. హిమాచల్ ఎన్‌పీఎస్ సంఘర్ష్ మోర్చా ప్రెసిడెంట్ ప్రదీప్ ఠాకూర్ ది వైర్‌తో మాట్లాడుతూ ప్రస్తుత ఎన్‌పీఎస్ విధానం పాత పెన్షన్ స్కీమ్ లాగా లాభదాయకం కాదని అన్నారు. ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత సుఖంగా జీవించాలంటే పాత పెన్షన్ విధానాన్ని తప్పనిసరిగా పునరుద్ధరించాలని ఆయన ఉద్ఘాటించారు. ఉద్యోగులకు వెన్నుపోటు పొడిచింది కాంగ్రెస్సే. ఇది ఇతర రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో తమ ఉద్యోగులకు ఓపీఎస్‌ను పునరుద్ధరించడాన్ని కూడా ఉదహరించింది. హిమాచల్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన 10 రోజుల్లో పునరుద్ధరిస్తుందని, అదే పునరావృతం చేస్తామని హామీ ఇస్తోంది. పంజాబ్‌లో తమ పార్టీ ప్రభుత్వం ఓపీఎస్‌ను ఆమోదించిన తర్వాత ఆప్ కూడా ఇటీవల ఈ అంశాన్ని లేవనెత్తింది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటన చేసిన వెంటనే, ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 2004లో ఓపీఎస్ స్థానంలో కొత్త పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) ప్రభుత్వ ఉద్యోగులకు అన్యాయం చేసిందని ట్వీట్ చేశారు. 'మేము పంజాబ్‌లో దాన్ని పునరుద్ధరించాము. ఇప్పుడు హిమాచల్, గుజరాత్‌లలో ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తే మేం చేస్తాం' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. అయితే హిమాచల్ ముఖ్యమంత్రి జై రాం ఠాకూర్ ఇటీవల ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తూ, కాంగ్రెస్ ఓపీఎస్‌కు అనుకూలంగా ఉంటే, అది అధికారంలో ఉన్నప్పుడు ఆ పథకాన్ని ఎందుకు నిలిపివేసిందని ఇటీవల ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలయిన చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ప్రవేశపెట్టిన ఓపీఎస్‌ను దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేయలేదని, దీన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి మద్దతు అవసరమని ఇటీవల రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పారని ఠాకూర్ అన్నారు. పంజాబ్‌లో ఆప్ తీసుకున్న నిర్ణయం కూడా ఎన్నికల్లో గెలవడానికి జూదమేనని ఆయన అన్నారు. ఎన్నికల్లో గెలవాలనే తపనతో రెండు పార్టీలు ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు.

జనాభా కారణాలు

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షం మద్దతు కోసం ప్రయత్నిస్తున్నందున ఉద్యోగులకు అంత ముఖ్యమైనది ఏమిటి?. వివరాల్లోకి వెళితే... హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వంలో 2.25 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. అలాగే దాదాపు 1.90 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 55 లక్షలకు మించని హిమాచల్ వంటి చిన్న రాష్ట్రానికి ఇది చాలా పెద్ద సంఖ్య. వారిపై ఆధారపడిన వారితో పాటు రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఈ ఉద్యోగులు 10-15 శాతం ఉన్నారని చెప్పవచ్చు. ఎన్నికలకు వెళుతున్న ఈ రాష్ట్రంలో (68 సీట్లలో 20 సీట్లు 2017లో 3,000 కంటే తక్కువ ఓట్లతో నిర్ణయించబడ్డాయి) ఏ రాజకీయ పార్టీ అయినా మెజారిటీ సీట్లు గెలవాలంటే ఉద్యోగుల ఓట్లు కీలకం. ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలు ప్రస్తుతం ప్రతి రాజకీయ పార్టీ రాజకీయ అజెండాలో అగ్రస్థానంలో ఉండటానికి కారణం అదే. రాజకీయ అవకాశవాదం, ఓటు బ్యాంకు రాజకీయాలు అని కొట్టిపారేసినప్పటికీ, బీజేపీ పాలనలో ఉద్యోగులు ఒప్పందాన్ని కలిగి ఉన్నారు. అయితే ప్రతిపక్ష శిబిరంలో ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. నవంబర్ 12 ఎన్నికలకు ముందు వెలుగులోకి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్య ఏమిటంటే, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్, ఆప్ వాగ్దానం చేశాయి. ఇది దాదాపు 50 శాతం మంది ఉద్యోగులకు సంబంధించినది. వారు ఈ సమస్య పై నెలల తరబడి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు.

ఇతర సమస్యలేమిటంటే...

ప్రతిపక్షాలు, బీజేపీ మధ్య టగ్ ఆఫ్ వార్‌ను ఆహ్వానించే అంశం ఓపీఎస్ మాత్రమే కాదు. 2022కి సంబంధించిన కరవు భత్యం చెల్లించకపోవడమే కాకుండా పెండింగ్‌లో ఉన్న పేస్కేల్ బకాయిల చెల్లింపులో జాప్యంపై కూడా ఒక వర్గం ఉద్యోగులలో అసంతృప్తిని వ్యతిరేకిస్తున్నారు. పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేయడంలో బీజేపీ వైఫల్యాన్ని కూడా వారు ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో పేపర్ లీకేజీల కారణంగా రాష్ట్రం కానిస్టేబుల్ నియామకాలను రద్దు చేయవలసి వచ్చింది. ఇది ఉద్యోగులకు భారీ ఎదురుదెబ్బగా మారింది. రాజకీయ విశ్లేషకుడు రమేష్ చౌహాన్ ది వైర్‌తో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగా కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా దిగువ హిమాచల్‌లోని కాంగ్రా, ఉనా, హమీర్‌పూర్, చంబా, బిలాస్‌పూర్‌లో. చౌహాన్ వివరించినట్లుగా, జిల్లాలలో వ్యవసాయం జీవనోపాధికి లాభదాయకం కాదు. స్థానికంగా పారిశ్రామికీకరణ జరగలేదు. ఇది ప్రభుత్వ నియామకాలకు చాలా ముఖ్యమైనది. అయితే నియామకాలు అనుకూలమైన స్థాయిలో జరగలేదని అంటున్నారు. అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడం పై ఉద్యోగుల్లో ఆగ్రహం ఉందన్న విషయాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. 'కానీ ప్రతిపక్షం దానిని సద్వినియోగం చేసుకోగలదా అనేది ప్రశ్న. మరి, బీజేపీ తన అధికారాన్ని నిలుపుకోవడానికి ప్రతిపక్షాల విమర్శలను ఎలా ఎదుర్కొంటుంది' అని చౌహాన్ అన్నారు.

వాడవాడలా ఏఐటీయూసీ సంబరాలు

- 103వ వ్యవస్థాపక దినోత్సవం
- ఏఐటీయూసీ, సీపీఐ రాష్ట్ర కార్యాలయాలవద్ద పతాకాల ఆవిష్కరణ
- 375 కేంద్రాల్లో ఘనంగా నిర్వహణ
- ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐటీయూసీ 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఏఐటీయూసీ శ్రేణులు పతాకాలను ఎగురవేసి, సంబరాలు జరిపారు. 26 జిల్లాల్లో దాదాపు 375 కేంద్రాల్లో వ్యవస్థాపక దినోత్సవాల్లో ఏఐటీయూసీ, అనుబంధ కార్మిక సంఘాలు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. చాలా ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, అన్నదానం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. విజయవాడ గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం దగ్గర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రారంభానికి ముందు జాతీయ పతాకాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రావులపల్లి రవీంద్రనాథ్ ఆవిష్కరించగా, ఏఐటీయూసీ పతాకాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఎగురవేశారు. అనంతరం జరిగిన సభకు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. బ్రేవరేజస్, సివిల్ సప్లయీస్ హమాలీలు, ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్లు, గొల్లపూడి గ్రామపంచాయతీ వర్కర్లు పెద్దఎత్తున తరలివచ్చారు. ఓబులేసు, మాట్లాడుతూ ఏఐటీయూసీ లాలా లజపతి రాయ్ అధ్యక్షతన 1920 అక్టోబర్ 31న ముంబైలో ఆవిర్భవించిందనీ, అప్పటి నుంచి 103 సుదీర్ఘ చరిత్రలో చాలా ఆటుపోట్లు, అణచివేతలు, ఆత్మబలిదానాలు త్యాగాలతో ఎరుపెక్కిపోయిందని వివరించారు. జైళ్లు, లాఠీలకు, తూటాలకు ఎదురునిల్చి, నిలబడి కార్మికులకు ఎన్నో విజయాలను సాధించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు కార్పెట్లు పరిచి కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని ధ్వజమెత్తారు. చాలా పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులపై ఉక్కు పాదం మోపడం సహించరాన్ని నేరమమన్నారు. పాలకవర్గాలు ఓట్లు సీట్లు నేపథ్యంలో చెప్పిన వాగ్దానాలను మరిచి పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తున్నారని, కార్మికవర్గం అంతా ఒకే తాటిపైకి వచ్చి సమర శంఖం పూరించాలని పిలిపిచ్చారు. 103వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా రాజ్యాంగాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండీ, బీజేపీ, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న నినాదంతో ప్రతిజ్ఞ చేస్తూ పోరాటాలకు సిద్ధమవ్వాలన్నారు. రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ 103 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏఐటీయూసీ ఆవిర్భావించిందన్నారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కార్మికులందర్నీ ఒక తాటి మీదకి తీసుకువచ్చి పోరాటం నిర్వహించిందని, ఎందరో మహానుభావులు వాళ్ల ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పేర్కొన్నారు. వారి త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్రమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్ని రద్దుచేసి రాక్షస ఆనందాన్ని పొందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, మాట్లాడుతూ దేశ ప్రజలకు చెందాల్సిన సంపద మొత్తాన్ని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి వ్యక్తులకి తాకట్టు పెడుతోందన్నారు. గంగవరం, కృష్ణపట్నం పోర్టులు, విశాఖ స్టీల్ ప్లాంట్, నెల్లూరు థర్మల్ ప్లాంట్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేటుకు కట్టబెట్టడం దుర్మార్గమనీ, దీన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో కార్మిక వర్గాన్ని చైతన్యవంతులను చేస్తూ పోరాటాలు ముందుకు కొనసాగిస్తామన్నారు. అనంతరం విజయవాడ దాసరి భవన్ వద్ద ఏఐటీయూసీ నగర సమితి అధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విజయవాడ దాసరి భవన్ వద్ద ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు అధ్యక్షతన సోమవారం ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు హాజరైయ్యారు. ముందుగా జి.ఓబులేసు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత ప్రజా నాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య 'కదలండిరా... కలవండిరా.. ఏఐటీయూసీ పిలుస్తోంది' అనే గీతాన్ని ఆలపించి ఉత్తజితుల్ని చేశారు. ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్షులు ఆర్.కే. ఆంజనేయులు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసుల రంగనాయకులు, హాకర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టు రమణారావు, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకులు శైలజ, ఏఐటీయూసీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ వియ్యపు నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎల్.శివకుమార్, ట్యాక్సీ వర్కర్ యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, ఎం.వి.రమణ, సూరిబాబు, బీఎస్ఎన్ఎల్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, నగర కార్యదర్శి వేణుగోపాల్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్.రమణ, బెవర శ్రీను, చీర్ల రామస్వామి, ప్రభుదాసు, తిరుపతిరావు, రిక్షా బాడీ వర్కర్స్ సంఘం నాయకులు మన్నెం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'రెండు వేళ్ల పరీక్ష'పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: అత్యాచార బాధితులను పరీక్షించేందుకు రెండు వేళ్ల పరీక్ష ఇప్పటికీ సమాజం నుంచి పూర్తిగా దూరం కాకపోవడంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహిళల గౌరవానికి భంగం కలిగించే రెండు వేళ్ల పరీక్ష జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, హిమా కోహ్లితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. అత్యాచారం, హత్య కేసులో దోషిగా తేలిన ఓ వ్యక్తిని జార్ఖండ్ హైకోర్టు నిర్దోషిగా విడిచిపెడుతూ తీసుకున్న నిర్ణయాన్ని డివిజన్ బెంచ్ తోసిపుచ్చుతూ, దోషిగా నిర్ధారించిన ట్రయిల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. ఈ సందర్భంగా, రెండు వేళ్ల పరీక్షలపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అత్యాచార నిర్ధారణకు వైద్యులు 'రెండు వేళ్ల' పరీక్షను నిర్వహించడం అత్యంత అమానవీయమని, ఈ పరీక్ష బాధితుల గోప్యతా హక్కుకు తీవ్ర భంగకరమని పేర్కొంటూ 2013 మేలో సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఈ విషయాన్ని న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, హిమా కోహ్లితో కూడిన ధర్మాసనం ప్రస్తావిస్తూ, ఇప్పటికీ సమాజంలో ఏదో ఒక చోట ఇలాంటివి చోటుచేసుకుంటుండటం దురదృష్టకరమని పేర్కొంది.

లైంగికంగా చురుకుగా ఉన్న మహిళ అత్యాచారానికి గురికాదని చెప్పలేమని అభిప్రాయపడింది. రెండు వేళ్ల పరీక్షల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ధర్మాసనం కొన్ని మార్గదర్శకాలను సూచించింది. టు ఫింగర్స్ టెస్ట్ జరక్కుండా చూడాలంటూ ఆయా రాష్ట్రాల డీజీపీలు, హెల్త్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగతంగా ఎవరు ఇలాంటి చర్యలకు పాల్పడినా అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్టుగా నిర్ధారించి, వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపింది. అలాగే, టూ ఫింగర్స్ పరీక్షలకు సంబంధించిన విద్యా విషయక సమాచారాన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల పాఠ్యాంశాల నుంచి తొలగించాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

పరీక్ష ఏంటి?: దేశంలోని అనేక ప్రాంతాల్లో రెండు చేతి వేళ్లను ఉపయోగించి మహిళలకు కన్యత్వ పరీక్ష జరుపుతున్నారు. 'టూ ఫింగర్ టెస్ట్'గా పిలిచే దీనిని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గతంలో అత్యాచార బాధితులను పరీక్షించడానికి వినియోగించేవారు. కానీ ఆ తర్వాత దీన్ని అశాస్త్రీయమైనదిగా భావించిన కోర్టు... ఈ పరీక్షను రద్దు చేసింది. అయినా వధువుకు కన్యత్వ పరీక్ష చేయడానికి దేశంలోని కొన్ని తెగల్లో ఇప్పటికీ ఈ మూఢనమ్మకాన్ని పాటిస్తున్నారు.

సంస్థానాల విలీనంలో పటేల్ పాత్ర కీలకం: గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశవ్యాప్తంగా 565 రాచరిక సంస్థానాలను విలీనం చేయడం ద్వారా సమగ్ర భారతదేశాన్ని నిర్మించటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర అనిర్వచనీయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. భారతరత్న వల్లభాయ్ పటేల్ 147వ జయంతిని సోమవారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ ఉక్కు మనిషిగా పేరొందిన వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా ప్రతి ఏడాదీ పాటిస్తున్నామన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ప్రధాని మోదీ చొరవతో గుజరాత్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 182 మీటర్ల సర్దార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని గవర్నర్ ప్రస్తుతించారు. పటేల్ దేశ తొలి ఉపప్రధానిగా, హోంమంత్రిగా సామ, దాన, భేద, దండో పాయాలతో రాచరిక సంస్థానాలను భారత్‌లో విలీనం చేయటం వల్లే దేశం ఐక్యంగా, సమగ్రంగా ఉందని అన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి భూములు తిరిగివ్వాలి

- రైతులకు అండగా నిలబడతాం
- అన్ని పార్టీలతో కలిసి పోరాడతాం: రామకృష్ణ

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భూబకాసురుడిగా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. సోమవారం చిలమత్తురు మండలంలో లేపాక్షి భూముల్ని ఆయన పరిశీలించారు. సత్యసాయిజిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... జగన్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను తిరిగి రైతులకు ఇప్పించేందుకు అన్ని పార్టీలను కలుపుకొని సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఒక్క ఇటుక పెట్టలేదు... గంపెడు మట్టి వేయలేదు కానీ సంస్థను ఏర్పాటు చేసినట్లు రికార్డులను సృష్టించారు... వేలల్లో ఉద్యోగాలు ఇస్తామని ఈ ప్రాంత రైతులను నమ్మించి భూములు కొనుగోలు చేశారు... ఆ భూమిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.4 వేలకోట్లు దోపిడీ చేశారని దుయ్యబట్టారు. సీఎం జగన్ బంధువులే ఫ్యాక్టరీలు, కంపెనీలు పేరుతో భూములు కొనుగోలు చేసి దివాలా పేరుతో దోపిడీకి పాల్పడ్డారన్నారు. తిరిగి అదే భూములను ముఖ్యమంత్రి మేనమామ కొడుక్కు ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. సీఎం జగన్ మామ రవీంద్రారెడ్డి కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులో దాదాపు రూ.600 కోట్లు విలువ చేసే 50 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఈ విషయంపై సీఎంకి లేఖ రాసినట్లు చెప్పారు. కంపెనీల పేరుతో ఒకవైపు బ్యాంకులను మరోవైపు పంటలు పండించే రైతులను మరోవైపు నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అభివృద్ధి లేని ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ఆ భూముల్లో కొంత మంది రైతులకు నష్టపరిహారం అందలేదని ఆ భూములు కూడా లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట ఉన్నాయని, అలాంటి రైతుల కోసం న్యాయ పోరాటం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఈ భూముల్లో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి కోట్ల రూపాయలు దోచుకోవడానికి మరో కుట్ర చేశారనే సమాచారం కూడా అందిందని చెప్పారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో ప్రత్యేక జీవో ద్వారా ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని ఆదేశాలిచ్చినప్పటికీ లేపాక్షి నాలెడ్జ్ హబ్ కంపెనీవారు కోర్టుకెళ్లి ఆ జీవోను అమలు చేయకుండా అడ్డుకున్నారని, ఇంతవరకు ఈ భూ కుంభకోణంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎందుకు విచారణకు ఆదేశించలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతో కలుపుకుని భూ పోరాటం చేసి రైతులకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు. టీడీపీ, జనసేన, సీపీఎం, కాంగ్రెస్ తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వచ్చినా కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వేమయ్య మాట్లాడుతూ... 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా... లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట 8844 ఎకరాలకు పైగా చౌక ధరకే బడుగు బలహీన వర్గాల ప్రజల నుంచి అభివృద్ధి పేరుతో భూముల్ని కొల్లగొట్టారన్నారు. భూముల్ని అడ్డం పెట్టుకుని బ్యాంకుల నుంచి రూ.4,500 కోట్ల అప్పు చేసి నేడు దివాలా పేరుతో మరోసారి మోసం చేశారని, లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఓ డ్రామా అని విమర్శించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఆవరణలో సీపీఐ జెండాను రామకృష్ణ ఎగురవేశారు. మరో భూ పోరాటానికి అంకురార్పణ చేసి రిలే నిరసనలు తెలుపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటానికి పెనుగొండ, సోమందేపల్లె, గోరంట్ల. చిలమత్తూరు, కదిరి, చిలమత్తురు మండలాలలో భూములు పోగొట్టుకున్న రైతులు, నిరుద్యోగులు, కార్మికులు తమ బాధ్యతగా పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కాటమయ్య, సత్యసాయి జిల్లా సీపీఐ డివిజన్ కార్యదర్శులు, మండల కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి మెరుగైన వ్యవస్థ

- స్పందనకు దీటుగా కార్యక్రమం
- ముఖ్యమైన అధికారులతో సీఎం జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వినతుల పరిష్కారంలో మరింత మెరుగైన వ్యవస్థ తేవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అంకిత భావానికి నిదర్శనంగా నిలవాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంపై ముఖ్యమైన అధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు. అందరూ కలిసికట్టుగా గతంలో ఎన్నడూలేని రీతిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్పందన కార్యక్రమం కంటే మరింత మెరుగ్గా, సమర్థవంతంగా దీన్ని నిర్వహించాలన్నదే ఉద్దేశమని పేర్కొన్నారు. అధికారులంతా కూర్చొని కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలనీ, ఇప్పటివరకూ అమలవుతున్న స్పందన కార్యక్రమాన్ని మైక్రోస్థాయిలోనూ వాటిని మరింతగా మెరుగ్గా తీర్చిదిద్దాలని, వినతుల పరిష్కారంలో ప్రజల సంతృప్తికి పెద్దపీట వేయాలన్నారు. సమస్యల పరిష్కారంపై సీఎంఓ, ఉన్నతస్థాయి అధికారులతో పర్యవేక్షించేలా ప్రణాళికలు రూపొందించా మన్నారు. ప్రజా సమస్యలను తీర్చాలన్నదే మన ఉద్దేశమనీ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత నిజాయతీగా, అంకిత భావంతో, కృతనిశ్చయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేశామని సీఎం పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, వ్యక్తులకు సంబంధించిన సమస్యలతోపాటు, కమ్యూనిటీకి సంబంధించిన సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టామని వివరించారు. ఒక నిర్దీత సమయం పెట్టుకుని వాటిని శరవేగంగా పరిష్కరించి ప్రజలకు అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగుతోందనీ, స్పందనతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం ద్వారా దృష్టిపెట్టామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాటిని పరిష్కరించేందుకు నిధులు కూడా కేటాయించామని, ఇంకా ఏమైనా సమస్యలు మిగిలిపోయి ఉన్నాయా? అనే దానిపై దృష్టిపెట్టాల్సిన అవసరముందని సూచించారు. స్పందన కార్యక్రమాన్ని మెరుపరిచేలా ఆలోచించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాల్లో వృత్తి నైపుణ్యం పెంచడం, నిర్మాణాత్మక రీతిలో వ్యవహరించడం అనే దానిపై దృష్టిసారించాలని ఆదేశించారు. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలనుకూడా పరిశీలించి అందులో ఎక్కడైనా స్వీకరించదగినవి ఉంటే, వాటినీ స్వీకరించాలన్నారు. పథకాలు కావొచ్చు, రెవెన్యూ రికార్డులకు సంబంధించిన అంశాలు కావొచ్చు...ఇలాఏ ఒక్కరూ కూడా అర్హులైన వారు మిగిలిపోకూడదనీ, సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిపోవద్దు అనేదే, దీని ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ విధానం ఎలా ఉండాలి? ఎలాంటి సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు చూపాలి? అన్నదానిపై ఒక మార్గదర్శక ప్రణాళిక రూపొందించాలన్నారు. సీఎంఓ, ఇతర ఉన్నతాధికారులతో కూడిన అధికార యంత్రాంగ వ్యవస్థకు ప్రజలు చేర్చిన ఫిర్యాదులు, వినతులకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమంపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం అమలు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి: ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం అమలును జనవరి 26వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. ఇంతకుముందు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రంలో నవంబరు 1నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం అమలులోకి రావాల్సి ఉంది. తాజా నిర్ణయంతో ఇది వాయిదా పడింది. సాంకేతిక పరిజ్ఞానం, తయారీ సామగ్రిని మార్చుకునేందుకు, సమకూర్చుకునేందుకు తగిన సమయం ఇవ్వాలంటూ ఫ్లెక్సీ తయారీదారుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్...ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధాన్ని 2023 జనవరి 26 నుంచి అమల్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈలోగా వారికి చేదోడుగా నిలవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సామగ్రిని మార్చుకునేందుకు అవసరం మేరకు రూ.20 లక్షల వరకు పావలా వడ్డీకే ఫ్లెక్సీ తయారీ దారులకు రుణాలు ఇవ్వాలని సూచించారు.

సంక్రాంతి బరి నుంచి తప్పకున్న ఆదిపురుష్?

ముంబై: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆదిపురుష్'. రామాయణ ఇతిహాస నేపథ్యంతో దర్శకుడు ఓంరౌత్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కృతి సనన్ నాయికగా నటిస్తోంది. సైఫ్ అలీఖాన్, సన్నీ సింగ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో భారీ బడ్జెట్‌తో టీ సిరీస్, రెట్రో ఫైల్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. చిత్ర నిర్మాణంలో యూవీ క్రియేషన్స్ నుంచి వంశీ, ప్రమోద్ భాగస్వా మ్యులుగా వ్యవహరిస్తున్నారు. అందరూ ఎదురుచూస్తున్న చిత్రంగా దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనవరి 12న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయబోతున్నట్లుగా ఇప్పటికే నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. అయితే.. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. సంక్రాంతి బరి నుండి ఈ సినిమా తప్పుకున్నట్లుగా తెలుస్తోంది. దీనికి కారణం వీఎఫ్ఎక్స్ అని అంటున్నారు. వీఎఫ్ఎక్స్ వర్క్ ఇంకా పెండింగ్ ఉన్న కారణంగా.. సినిమాని వచ్చే సంవత్సరం మేలో విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లుగా టాక్ నడుస్తోంది. కానీ చిత్రయూనిట్ నుంచి మాత్రం.. ఈ సినిమా వాయిదా విషయమై ఎటువంటి అప్‌డేట్ రాలేదు. ఈ సినిమా వాయిదాకు సంబంధించి ఇండస్ట్రీ వర్గాల్లో మరో వార్త కూడా హల్‌చల్ చేస్తోంది.

మళ్లీ సెట్స్‌పైకి 'ఎస్ఎస్ఎంబీ28'

హైదరాబాద్: టాలీవుడ్ సూపర్ స్టార్స్‌లో మహేశ్ బాబు ఒకరు. 'సర్కారు వారి పాట' తర్వాత అతడి నుంచి ఏ సినిమా రాలేదు. ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. బడా నిర్మాణ సంస్థ 'హారిక హాసిని క్రియేషన్స్' నిర్మిస్తోంది. కొన్ని రోజుల క్రితమే చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఫస్ట్ షెడ్యూల్ కూడా ముగిసింది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌పై పోరాట సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉండగానే.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనేక రూమర్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం ప్రారంభమయ్యాయి. సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధం కాలేదని.. అందువల్లే ప్రాజెక్టు ఆగిపోయిందని వదంతులు హల్‌చల్ చేశాయి. సెకండాఫ్‌తో మహేశ్ సంతృప్తి చెందలేదని మరికొన్ని వార్తలు వెలువడ్డాయి. ఈ వదంతులన్నింటికి చిత్ర నిర్మాత నాగ వంశీ ఒక్క ట్వీట్‌తో చెక్ పెట్టాడు. ట్విటర్‌లో పోస్టును షేర్ చేశాడు. ఈ చిత్రం రెండో షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం అవుతుందని నాగవంశీ సోషల్ మీడియాలో చెప్పాడు. సినిమాకు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ రాబోయే రోజుల్లో అందిస్తామన్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అతడు', 'ఖలేజా' తర్వాత మహేశ్- త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మూవీ కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలున్నాయి.

ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం

- అర్ధసెంచరీతో రాణించిన ఫించ్
- అద్భుతమైన ఫీల్డింగ్ చేసిన ఐర్లాండ్ ఆటగాడు మెక్‌కార్తీ

బ్రిస్బేన్: టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా బ్రిస్బేన్ లోని గబ్బా స్టేడియంలో ఆస్ట్రేలియా, ఐర్లాండ్ మధ్య జరిగిన సూపర్-12 మ్యాచ్‌లో ఐర్లాండ్ పై ఆస్ట్రేలియా 42 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కంగారులు 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ఆదిలోనే డేవిడ్ వార్నర్ వికెట్ కోల్పోయింది. మెక్‌కార్తీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన మిచెల్ మార్ష్, కెప్టెన్ ఫించ్‌తో కలిసి మ్యాచ్‌ను ముందుకు నడిపించారు. 22 బంతుల్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లతో 28 పరుగులు చేసిన మిచెల్ మార్ష్ మెక్‌కార్తీ బౌలింగ్ పెవిలియన్ చేరాడు. అనంతరం వచ్చిన మ్యాక్స్‌వెల్ 13 పరుగులకే వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ ఆరోన్ ఫించ్ స్టోయినిస్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. ఈ క్రమంలో ఫించ్ అర్ధసెంచరీ చేశాడు. 44 బంతుల్లో మూడు సిక్స్‌లు, ఐదు ఫోర్లతో 63 పరుగులు చేశాడు. స్టోయినిస్ 25 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఇందులో ఒక సిక్స్, మూడు ఫోర్లు ఉన్నాయి. టిమ్ డేవిడ్ 15 పరుగులు చేయగా.. వికెట్ కీపర్ వెడ్ 7 పరుగులు చేశాడు. ఐర్లాండ్ బౌలర్లలో మెక్‌కార్తీ మూడు వికెట్లు తీయగా.. లిటిల్ రెండు వికెట్లు పడగొట్టాడు. 180 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 18.1 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌట్ అయింది. ఐర్లాండ్ వికెట్ కీపర్ లోర్కాన్ టక్కర్ హాఫ్ సెంచరీతో రాణించాడు. 48 బంతుల్లో ఒక సిక్స్, 9 ఫోర్లతో 71 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో మెక్‌కార్తీ అద్భుత ఫీల్డింగ్ చేశాడు. 14 ఓవర్ రెండో బంతిని అదిర్ వేయగా.. స్టోయినిస్ దాన్ని సిక్స్ కొట్టాలని పైకి లేపాడు. బంతి గాల్లో లేచింది. పరుగెత్తుకుంటూ వచ్చిన మెక్‌కార్తీ క్యాచ్ పట్టాడు. కానీ బౌండరీలో పడిపోతున్నానని తెలిసి బంతిని బయటకు వేశాడు. దీంతో ఆస్ట్రేలియాకు రెండు పరుగులే వచ్చాయి.

వెన్నుగాయంతో దినేశ్ కార్తీక్ ఔట్?

పెర్త్: టీ20 ప్రపంచకప్ 2022లో తొలి పరాజయాన్ని చవి చూసిన టీమిండియాకు గట్టి షాక్ తగిలింది. స్టార్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ వెన్ను గాయంతో జట్టుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగే మ్యాచ్‌లో అతను ఆడటం సందేహంగా మారింది. దినేశ్ కార్తీక్ గాయం గురించి బీసీసీఐ ఎలాంటి ప్రకటన చేయకపోయినా.. అతను తదుపరి మ్యాచ్ ఆడటం కష్టమేనని జట్టు వర్గాలు పేర్కొన్నాయి. సౌతాఫ్రికాతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ కీపింగ్ చేస్తూ గాయపడ్డాడు. బౌన్స్, పేస్‌కు అనుకూలిస్తున్న వికెట్‌పై భారత పేసర్లు చెలరేగడంతో వికెట్ కీపర్‌గా కార్తీక్ పలుమార్లు పైకి ఎగిరి బంతులను అందుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే చాలా ఎత్తులో వచ్చిన బంతిని అందుకునే ప్రయత్నం చేసిన కార్తీక్.. మోకాలిపై ల్యాండ్ అవ్వడంతో అతని పక్కటెముకలు పట్టేసాయి. ఫిజియో వచ్చి ప్రథమ చికిత్స చేసినా గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో కార్తీక్ మైదానం వీడాడు. 15వ ఓవర్ తర్వాత ఈ ఘటన చోటు చేసుకోగా.. రిషభ్ పంత్ అతని స్థానంలో కీపింగ్ చేశాడు. అయితే అతని గాయం తీవ్రతపై స్పష్టం లేకున్నా.. తదుపరి మ్యాచ్‌కు కార్తీక్ అందుబాటులో ఉండే అవకాశం లేదని సమాచారం. మ్యాచ్ అనంతరం విలేకర్ల సమావేశంలో పాల్గొన్న భువనేశ్వర్ కుమార్ ముందు ఇదే విషయం ప్రస్తావించగా... కార్తీక్ గాయంపై క్లారిటీ లేదని చెప్పాడు. టీమ్ ఫిజియో అతని గాయాన్ని పరిశీలిస్తున్నారని, పెద్ద గాయం కాకుడదనే తాము కోరుకుంటున్నామని తెలిపాడు. తీవ్ర చలి ఉన్న పెర్త్ మైదానంలో పక్కటెముకలు పట్టేయడం సర్వసాధారణమని, కార్తీక్ విషయంలో అదే జరిగి ఉంటుందని చెప్పాడు. దినేశ్ కార్తీక్ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి 52 పరుగుల భాగస్వామ్యాన్ని అందించిన అతను 6 పరుగులు మాత్రమే చేశాడు. బ్యాటింగ్ అవకాశం వచ్చిన రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంతో కార్తీక్‌ను పక్కనపెట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ గాయం సాకుగా చూపి అతన్ని పక్కనపెట్టే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.